
భారత
ులు
చే
పరిశ్రమల
డా॥ఆర్.వి.రా

# భారతీయ చేతిపరిశ్రమలు

## (INDIAN HANDICRAFTS)


By

**Dr. R. V. Rao.** M.A., B.T., Ph.D.

*Joint Director*

COTTAGE INDUSTRIES

Govt. of Andhra Pradesh

HYDERABAD.



ప్రచురణ

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్డు - హైదరాబాదు.

ప్రథమ ముద్రణ 3-3-1967


338.6340954
రావు---భార

ప్రతులు. 2000

C16261
A/C .21899

వెల. రు. 3

శివాజీ ప్రెస్, సికింద్రాబాదు.



*This Little Book is*

Dedicated to Lord Sri Venkateswara Swami

of the Seven Hills.

Rastrapati Bhavan
New Delhi 4.
January 22, 1967.

The President sends his best wishes for success in your efforts and hopes that your book will be widely read.

21899

Dr. R.V. Rao.
3-4-674/1
Near Narayanguda Market
Hyderabad.

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| ఉపోద్ఘాతం | — | | i |
| ఒకటవ అధ్యాయం | — | చేతిపరిశ్రమ అనగా నేమి ? | 1 |
| రెండవ అధ్యాయం | — | వెనుకబడిన దేశముల ఆర్థికవ్యవస్థలో చేతిపరిశ్రమల స్థానము | 5 |
| మూడవ అధ్యాయం | — | వెనుకబడిన దేశముల ఆర్థికప్రణాళికలో చేతి కళలు | 10 |
| నాల్గవ అధ్యాయం | — | కొన్ని భారతీయ చేతిపరిశ్రమలు | 14 |
| ఐదవ అధ్యాయం | — | వడ్రంగము | 19 |
| ఆరవ అధ్యాయం | — | ఆట వస్తువులు | 23 |
| ఏడవ అధ్యాయం | — | లక్క-బొమ్మలు | 29 |
| ఎనిమిదవ అధ్యాయం | — | దంతము, కొమ్ము వస్తువులు | 32 |
| తొమ్మిదవ అధ్యాయం | — | తివాసీలు | 35 |
| పదవ అధ్యాయం | — | చీరెలు, ఎంబ్రాయిడరీ, పనిలేసులు | 40 |
| పదకొండవ అధ్యాయం | — | చేతిపరిశ్రమలు – కొన్ని ఆర్థిక సమస్యలు | 45 |
| పన్నెండవ అధ్యాయం | — | అఖిల భారత చేతిపరిశ్రమల సంస్థ కృషి | 53 |
| ఉపసంహారము | — | | 59 |
| అనుబంధము | — | ఆంధ్రప్రదేశ చేతిపరిశ్రమలు | 62 |
| అనుబంధము 2 | — | ఫిలిగ్రీ పరిశ్రమ | 79 |

# ఉపోద్ఘాతం

భారతీయ కళలలో అత్యుత్తమమైన దానియం దానంద శ్రుతి వినబడుట నిస్సందేహం. ఉజ్వలమైన నైపుణ్యంలో భారతీయ మరియు ప్రపంచ ప్రజానీకాని కళిరుచి వున్నన్నాళ్ళు, ప్రతిభావంతమైన పనితనపు విలువను వారు గ్రహింప గల్గినన్నాళ్ళు, సౌందర్యవంతమైన వస్తుపరిచయమును చూచి వారు ఆనందింప గల్గినన్నాళ్ళు, భారతదేశపు కళలలో ఒకటైన చేతిపనులు జీవించడమేగాక, ఎప్పటికీ వర్ధిల్లుతాయి —"

*సర్ జార్జిబరడ్ ఉడ్.*

సౌందర్యంగల వస్తువు లెల్లప్పుడు ఆనంద ప్రదాలనే మాట మనం తరచు వింటూంటాం. మనిషి తిండి మాత్రంతోనే బ్రతకలేడు అనాదిగా మానవుడు అందమైన వస్తువులకొరకు, కళకొరకు ఆకాంక్షిస్తూనే వున్నాడు. మట్టి వస్తువులు, పేడ బొమ్మలు పేదవారి అభిమానానికి మాత్రమే నోచుకొంటే అంతకన్న స్తోమతగల సంపన్నులు ఖరీదైన వాటిని కొనవచ్చు. భారతీయ చేతికళలలోని నిరాడంబర సౌందర్యంలో, తరతరాల, యుగయుగాల, భారతీయ సాంప్రదాయాలు ప్రతిబింబిస్తాయి. ఆపనివారిని సంఘం ఆదరించింది. సంపన్నులు అభిమానించారు. రాజులు పోషించారు. నైజాం ప్రభువు, ఆయన సామంతులు హైదరాబాదులోని, బిద్రి, హిమ్రూ, ఫిలిగ్రీ మొదలైన చేతి పనులను ప్రోత్సహించారు. కాబట్టి ఆనాటి హైదరాబాదు,

ఈనాటి ఆంధ్రప్రదేశ్ రకరకాల నాణ్యతగల చేతిపనులకు ఏ యితర రాష్ట్రమూ పొందనంత ప్రఖ్యాతి సంపాదించుకొన్నది. చేతిపనుల యెడల మనదేశంలోని సంపన్నులకు గల అభిమానానికి, వివిధ దేశాలలో తయారైన చేతిపనుల వస్తువులు కొనడంలో వారి సంసిద్ధతకు సాలార్ జంగ్ మ్యూజియమ్ ప్రబల నిదర్శనం.

దేశానికి స్వతంత్రం వచ్చింది. సంస్థానాలు అదృశ్యమయ్యాయి. జాగీర్దారీలు అంతమయ్యాయి. ఇది చేతిపనులకు, ప్రమాదకరంగా పరిణమించింది వీటిని పోషించ వలసిన బాధ్యత ప్రజానీకంమీద పడింది. పోటీమీద ఆధారపడిన ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి తీరుతెన్నులు నిర్దేశించగలవారు ప్రజలేకదా? సంపన్నమైన మన జాతీయ వారసత్వాన్ని కాపాడగలవారు ప్రజలే. విద్యార్థుల బాల్యములో నుండగానే వారికి చేతిపనులపై అభిరుచి కల్గించుట చాల అవసరము మన గ్రామసీమలలోని ఆట వస్తువులు యంత్ర నిర్మితాలైన ఆట వస్తువులు వచ్చినా నశించలేదు. సంఘంలో వస్తున్న మార్పుల కనుగుణ్యంగా మనం మారవలసిందే. సాధ్యమైనంత వరకు సమన్వయ మార్గమవలంబించి, చేతిపనులలోని అంద చందాలను విస్మరింపకుండా వుండటం మన కర్తవ్యం.

పంచవర్ష ప్రణాళిక లెన్ని వచ్చినా, సమాజ వికాస కార్యక్రమాలు జరుగుతూనే వున్నా, పంచాయతీ రాజ్యం నడుస్తున్నా, గ్రామీణ ప్రాంతాలలో పరిస్థితి మాత్రం అసం

తృప్తికరంగానే వుంది. పనిలేనివారు అందుకోరకు గ్రామాల నుండి పట్టణాలకు వచ్చేయడం, జరుగుతునే వుంది. గ్రామాల లోని పూర్వపు స్వయంపోషకత్వం పోయింది. పెద్దపరిశ్రమల తాకిడి గ్రామసీమలమీద పడుతూనే వుంది. చేతిపనివారు పిల్లా మేకతో జీవనోపాధికై పట్టణాలకు వచ్చేస్తున్నారు. పాశ్చాత్య విద్యమీద మోజు, యింతకన్న యెక్కువ ఆదాయ మిచ్చ్వగల వృత్తులపై వ్యామోహం, వారిలో మెండవుతున్నాయి. ఇది భారతీయ చేతిపనుల కొక సవాలుగా పరిణమించిందని నా అభిప్రాయం. ఈచేతి పనులను గూర్చి నేను సన్నిహితంగా పరిశీలించాను. రెండు రాష్ట్రాలలో మాజీహైదరాబాదు రాష్ట్రం లోను, తరువాత ఆంధ్రప్రదేశములోను ఈచేతి పనుల నిర్వహణ కార్యక్రమాలతో నాకు సన్నిహిత సంబంధము కూడ వుంది. అఖిలభారత చేతిపనుల మండలిలో ఈవిషయంమీద జరిగిన సమాలోచనలో కొన్ని సంవత్సరాలు పాల్గొన్నాను. చేతి పనివారు గ్రామసీమలు వదలి, నగరాలకు తరలి పోవుట అరికట్టడానికి వారికి పనికల్పించే పరిస్థితి కల్పించటానికి, మేలి రకపు పనిముట్లు ప్రదర్శన మందిరాలుగల సమష్టి సదుపాయ కేంద్రాలను నిర్మల్, కొండపల్లి, వరంగల్, ఏలూరు, ఏటి కొప్పాక, అరకు, హైదరాబాదు మొదలగుచోట్ల ప్రభుత్వం ఏర్పరచారు. సహకార యత్నాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తు న్నారు. "వెనుకటి పనివారి సంతానం యింకా స్త లాభసాటిగా వుండే వృత్తుల వంకకు మరలి పోతున్నారు" అనేమాట

నిస్పందేహం. శిక్షణావకాశాలు, విక్రయావకాశాలు, యివ్వ బడుతున్నా పనివారికి, కనీస వేతనం సాంఘిక భద్రత పొందే టందుకు వీలుగా ఇంకా చెయ్యవలసినది చాలా వుంది. గృహ వసతి కల్గించుటకూడ చాలా అవసరం. ఈవిషయాన్ని చాలా అపామాషీగా చూచి, పొదుపు చర్యలనేమాట రాగానే ఆగొడ్డలి వేటు చేతిపనులమీదే వేయడం శోచనీయం. ఇటీవల విజయవాడలో జరిగిన ఒక పత్రికా సమావేశంలో అఖిలభారత చేతిపనుల మండలి అధ్యక్షురాలు శ్రీమతి కమలాదేవి చటో పాధ్యాయకూడ ఈమాటే అన్నారు. ఈపరిస్థితికి కారణాలు కూడ సువిదితమైనవే. చేతిపనుల ఉత్పత్తిదారులకు సుసంఘ టితమైన వ్యవస్థలేదు. వారికి ప్రచార సాధనాలు లేవు. వాటి అభివృద్ధికి బాధ్యులైన వారికి దివ్య భవనాలవంటి ఆడంబరా లుండవు. పాశ్చాత్యులు మన చేతిపనులను మెచ్చుకొన్నప్పుడు మాత్రం మనం కొంత ఉత్సాహం చూపటం, అంతటితోనే ఆగిపోవడం జరుగుతోంది. మన చేతిపనులు మన సంస్కృతీ ప్రతిబింబాలు కనుక మనం వాటి అభివృద్ధికి నిర్విరామంగా కృషి చేయాలి. పాశ్చాత్యులు వచ్చి వాటిని మెచ్చుకొనేదాక ఆగకూడదు. సంఘంలో వివిధ రంగాలవారు వాటిని ప్రోత్స హించడం గర్వకారణంగా భావించాలి. సృజనాత్మకశక్తి, నైపుణ్యం గలవారు ఆకలి బాధకు అలమటించి, మరణా నంతరం మాత్రం గౌరవాలు పొందితే, అది మనకు గర్వకారణ మైన విషయంకాదు. మనం పనివారిని ప్రోత్సహించిన నాడే

సృజనాత్మక శక్తి వర్ధిల్లుతుంది. వారి సంఖ్య దురదృష్టవశాత్తు నానాటికి క్షీణించి పోతూంది. వారు హెచ్చు సంఖ్యలో శిక్షణ పొందేటట్లు తద్వారా, వారసత్వం నశించకుండా నిలచేటట్లు మనం ప్రయత్నించాలి. ఈవిషయంలో కొంతపని జరుగక పోలేదు. కాని భవిష్యత్తులో జరుగవలసిన పని చాల ఉంది.

మన చేతిపనుల చరిత్ర అతిప్రాచీనమైనది. అవి యుగ యుగాలుగా నిలచియున్నాయి. పటిష్ఠమైన జానపద సాంప్ర దాయం, సజీవమైన సంస్కృతీ ప్రభావం, వ్యక్తిత్వంపై గాఢానురక్తిగల యుగధర్మం వీటికి ప్రాణం పోసాయి. వీటి సాంప్రదాయం, మన మతం తత్వశాస్త్ర జీవన విధానాలతో పెనవేసుకొన్నది. దీనికి అన్ని వర్గాలవారూ దోహదం చేసారు. భారతదేశంలో వివిధ సాంస్కృతుల సమైక్యతకు చేతిపనులు చిహ్నములని చెప్పుట అసమంజసం కాదు.

ఋగ్వేద కాలంలో కూడ లోహపు చేతిపనులు లేక పోలేదు. ప్రాచీన భారతదేశంలో గిల్డు విధానం వుండేది. పని వారు ఎవరికి వారే కాకుండా, సహకారపద్ధతిని వ్యవహరించ వలసిన అవసరం ఆనాడే గుర్తించారు. రామాయణంలో 18 చేతిపనుల సంస్థలు (గిల్డులు), వుండినట్లు పేర్కొన బడినది. చేతి పనుల చరిత్రంతా, యిక్కడే ఏకరువు పెట్టడంవల్ల ప్రయోజన ముండక పోవచ్చు. అజంతా, ఎల్లోరాలలోని అపురూప లావణ్యం, మనదేవాలయాల అందచందాలు, మనచేతిపనుల విశి ష్టత నాటి భారతదేశ ప్రాభవానికి ప్రబల దృష్టాంతాలు.

భారతావని, తన ఆధ్యాత్మిక విలువల నిలుపుకొనగలదు. నూతన పరిణామాలను స్వీకరించి జీర్ణించుకోగలదు. మన చేతి పనుల సాంప్రదాయానికిది విశిష్ట లక్షణం. గ్రీసు తనవిజేతలనే జయించినట్లు మనదేశంలో కనీసం సంస్కృతీ రంగంలో అదే పని జరిగింది యంత్రయుగం కూడా చేతిపనులను తుద ముట్టింపలేక పోయినది. బిద్రీ, హిమ్రూ తివాసీలు మొదలైనవి విదేశములలోఉద్భవించిన చేతి పనులే. కాని అవిస్థానిక సంస్కృతీ సాంప్రదాయాలలో మిళితమై పోయాయి. అన్ని వర్గాలకు చెందిన పనివారల ఆసక్తిని చూరగొన్నవి.

భారతదేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో చేతిపనివారికి కీలక స్థానముండెడిది. అతడు తన చేతిపనికి అంకితమై పోయి అందు పాల్గొనుట, తన విధాయక ధర్మంగా భావించెడివాడు. అవిక్రమంగా పతనమైపోయాయి. కార్మిక సంఘు మనస్తత్వం వేతనాల హెచ్చింపు వలన నాణ్యం, ప్రమాణాల విషయంలో అశ్రద్ధ వచ్చినది. మొసలి కన్నీళ్ళవల్ల లాభంలేదు. పనితనంలో నాణ్యత కాపాడుట, సమర్థులైన పనివారిని ప్రోత్సహించుట, ప్రభుత్వం సగర్వంగా చేయాలి. ఇటీవల కాలంలో అఖిలభారత చేతిపనుల మండలి సమర్థులైన పనివారికి నగదు బహుమానా లిచ్చి, వారి ప్రతిభను గుర్తించుటద్వారా ఈ విషయంలో మార్గదర్శియైనది.

సత్ఫలితాలు కలగాలంటే చేతిపనుల విషయమై క్రమ బద్ధమైన చర్యలు తీసుకొనాలి. చెదురు మదురు పరిష్కార

మార్గాలవల్ల ఏమీలాభముండదు. ముడిసరకుల సరఫరా, పరికరముల వినియోగం, నమోనాల సమకూర్చుట, విక్రయావకాశాలు-ఇవన్నీ పరస్పర సంబంధంగల విషయాలు— నమూనాలు ఉత్పత్తికి దోహదకారాలైన సాంకేతిక పద్ధతులమీద ఈ రంగంలో కూడ పరిశోధన జరగాలి. అభివృద్ధికరమైన, నమోనా అంటే, మరీచౌకబారు నమోనాలని అర్థంకాదు. పదిమంది కొనుగోలుదార్లను ఆకర్షించే రీతిగా సాంప్రదాయ సిద్ధమైన నమోనాలను మలుచుకొనుట యని అర్థం. ఉత్పత్తి విధానాలలో "అభివృద్ధి" అంటే యంత్రాలను, మానవశక్తి ఆవశ్యకత తగ్గించే సాధనాలను విచక్షణ లేకుండా వాడమని కాదు. వస్తువుల కళాప్రాశస్త్యం చెడకుండా చూస్తునే వాటిని చౌకధరలకు లభ్యం చేయడానికి దోహదకరంగా "మధ్యే మార్గ సాంకేతిక విధానం" (Intermediate technology) అనుసరించుట యని అర్థం. నిత్యకృత్యాలలో ఉపయోగ పడని ఒకవస్తువును నెలల తరబడి తయారుచేసిన పనివారు, అది అమ్మడానికి "మీరా మీరా" అని అందర్నీ అర్థించి, చివరకు మధ్యస్థుల దోపిడీకి గురియైన సంఘటనలెన్నో నేను కళ్ళారా చూచాను. సాంకేతికంగా కొన్ని ప్రక్రియలను యంత్ర బద్ధం చేయడంవల్ల ఉత్పత్తి పెరగడం, యెక్కువమంది కొనుగోలుదార్లకు అవి లభ్యంకావడం జరుగుతుంది. అయితే చేతిపనులలోని కళాత్మక విభాగం తప్పక చేతితోనే జరగాలి. అప్పుడే చేతిపనుల విశిష్టత నిలుస్తుంది. అప్పుడే భారీయెత్తున తయారైన వస్తువులకు,

వీటికి మధ్యగల తేడా తెలుస్తుంది. మనకుగల నమోనాల సంపదకు కొదవలేదు. దేశమంతటాగల మన ఆలయ శిల్పాలు, కుడ్యచిత్రాలు మొదలగు వాటివల్ల మనకు అపారమైన నమోనాల సంపద సంక్రమించినది. ఆ వస్తువులు సౌందర్యాని కాటపట్టైవుండాలి. వివిధ రాష్ట్రాలలో నమోనాల పరిశోధన కేంద్రాలున్నాయి. బెంగుళూరు కేంద్రంలో ఇంతవరకు గణనీయమైన పని నిర్వహింపబడింది.

ఉత్పత్తిని ప్రమాణ బద్ధం చేయుటకు "క్వాలిటీ మార్కింగ్" (నాణ్యతానిర్దేశం) అవసరం. నాణ్యమైన ముడి సరుకు వాడినప్పుడే ఇది సాధ్యమవుతుంది.

అఖిలభారత చేతిపనుల మండలి యాజమాన్యాన విక్రయ విషయాలపై సదస్సులు జరుపబడిన మాట వాస్తవమే. ఎగుమతులను హెచ్చుచేయుటకు చర్యలు తీసుకొనబడినవి. ద్వితీయ ప్రణాళికా కాలంలో ఎగుమతులు రూ॥ 9.67 కోట్లు కాగా తృతీయ ప్రణాళికలో ఇవి రు॥ 20 కోట్లకు పెరిగాయి. చేతిపనులకు సుసంపన్నమైన అవకాశాలున్నాయి. పెక్కు ముడి సరుకులు స్థానికంగానే లభ్యమవుతున్నాయి. ప్రగతి పథంలో వున్న దేశాలకు అత్యావశ్యకమైన విదేశమారక ద్రవ్యమును సంపాదింప గల శక్తికూడ వీటికధికంగానే వుంది.

యంత్రాల ద్వారా తక్కువ ఖర్చుకు వస్తువులు తయారు కాగల యంత్ర పరిశ్రమల తాకిడికి తట్టుకొని, చేతిపనులు

బ్రతకగలవాయని కొందరు సందేహిస్తున్నారు. వాటికి విదేశ ములకెగుమతి యగు వస్తువులలో ఒకస్థానం లభించినది. దేశీయ విక్రయంలో కూడ అభివృద్ధి గోచరిస్తున్నది. బాలారిష్టములకు గురియైన చేతిపనుల సంస్థ, (Corporation) చేనేత సంస్థలో విలీనము చేయబడినది. ఎగుమతులు ప్రోత్సహించుట కదికృషి చేస్తున్నది. విదేశములలోని ప్రదర్శనాలలో మనదేశం పాల్గొం టున్నది. విదేశాలలోని మనప్రదర్శనా మందిరాల నిర్వహణ సక్రమంగా లేదని, రాయబార మందిరాలలోను, వ్యాపార ప్రతినిధి సంస్థలలోను సరియైన, విషయ పరిజ్ఞానంగల వారు నియమింపబడుట లేదని ప్రముఖుల అభిప్రాయం.

విదేశాలలో చేతిపనులను గూర్చి ప్రచురింపబడిన పుస్త కాలను చూస్తే, వారు తమసాంస్కృతిక సంపదను, మనకు సాక్షాత్కరించుటకు పడుశ్రమ, తీసుకొను శ్రద్ధ, మనకు విశద మవుతుంది. ఉత్పత్తిని గూర్చిన ప్రతి చిన్నవిషయమును, శ్రద్ధగా వివరిస్తారు. అటువంటి ప్రచారంగాని, అభివృద్ధికి, దోహద చర్యలుగాని మన దేశంలో సంతృప్తి కరంగా జరగటం లేదు. వాటి ఉత్పత్తి పరిణామం, దాని ఖరీదుని బట్టి వాటి సిసలైన విలువను నిర్ణయించలేము. అవిమన సాంస్కృతిక సాంప్రదాయ చిహ్నాలు. అవి మన రాయబారులవలె వ్యవ హరించి, యితర దేశాలతో పరస్పర స్నేహసంబంధాలు నెల కొల్పుటలో తోడ్పడగలవు. చేతిపనులకు, విదేశ విక్రయావ

కాశములతోబాటు, దేశములో కూడ, విక్రయావకాశములు మెండుగనే గలవు.

సుమారు 25 సంవత్సరముల ముందు "కుటీర పరిశ్రమలు, ప్రణాళికా బద్ధమైన ఆర్థిక వ్యవస్థ" అను గ్రంథమును ప్రకటించి నదాదిగా, ఈవిషయంమీద పరిశీలన జరుపుచుంటిని. కొద్ది సంవత్సరాలక్రితం "భారతదేశపు చేతిపరిశ్రమలు—పారిశ్రామిక కళలు" అను గ్రంథములో ఆంధ్రప్రదేశ చేతిపరిశ్రమలపై ప్రత్యేక వ్యాసము వ్రాసితిని.

1962 లో భారత ప్రభుత్వ ప్రాతిపదిక సాహిత్యమును గూర్చి జరిపిన తృతీయ పోటీలో, యీపుస్తకానికి బహుమానం లభించింది. ఈగ్రంథమును ప్రచురించమని అనేకమంది కోరి యున్నారు. ఈగ్రంథము ప్రచురించినందులకు ఆంధ్రసారస్వత పరిషత్తు వారికి, ఆసంస్థ గౌరవ ఉపాధ్యక్షులు, ఉత్సాహవంతు లగు శ్రీ దేవులపల్లి రామానుజరావు గారికి, నాహృదయ పూర్వక కృతజ్ఞత వెల్లడిస్తున్నాను.

ఈగ్రంథంలో కొన్ని ఛాయా చిత్రములు చేర్చి యున్నాను. అవి ఈగ్రంథపు విలువను వృద్ధిచేయునని నమ్ము తున్నాను.

హైదరాబాదు.
జనవరి 1967.

డాక్టర్ ఆర్. వి. రావు.

# భారతీయ చేతి పరిశ్రమలు

(INDIAN HANDICRAFTS)

ఒకటవ అధ్యాయము

# భారతీయ చేతిపరిశ్రమలు

## 1. చేతిపరిశ్రమలు అనగా నేమి?

భారతీయ చేతిపరిశ్రమలు అనాదినుండియు భారతీయ సంస్కృతికి ప్రతిబింబములై యున్నవి. మనప్రజానీకపు దైనందినజీవనమున కానవచ్చు సౌందర్యపిపాస, మనకళాకారుల కళానైపుణ్యము వేలాదివేల గ్రామములలో ఉత్పత్తి చేయబడుచున్న కళాసమన్వితమైన చేతిపని వస్తువులలో ప్రతిఫలించుచున్నవి. అవి మన కళాసంప్రదాయమునకు, పారిశ్రామికవిభవమునకు చక్కని తార్కాణములు. కాని బ్రిటిషుపరిపాలనమూలమునను, పారిశ్రామిక విప్లవ ఫలితముగాను, చారిత్రక రాజకీయశక్తుల ప్రభావమువలనను వీని మనుగడకు అంతరాయము కలిగినది. యంత్రయుగమున కర్మాగారములలో కారుచౌకగా తయారుచేయబడు

వస్తువుల ఉప్పెన వీనిని ముంచివేసినది. 19 వ శతాబ్దమున గూడ విశ్వవిఖ్యాతి నొందియుండిన మన వంగదేశపు 'క్యాలికో', 'కోరా'లు, ఢక్కా 'మస్లిను'లు, మూర్షిదాబాదు, కాశీ, అహ్మదాబాదు, కంచిపట్టుబట్టలు, కాశ్మీరశాలువలు, వారణాసి, నాసిక్, పూనా, హైదరాబాదు, విశాఖపట్టణము, తంజావూరు నగరములలో తయారగు లోహపు వస్తువులు, వరంగల్లు, ఏలూరు తివాసీలు, మైసూరు చందనపు వస్తువులు - వీటి ప్రాశస్త్యమును ఎరుగనివా రెవరు!

జాతీయప్రభుత్వ స్థాపనానంతరము 1947 నుండియు మనపారిశ్రామికకళల పునరుజ్జీవనమునకు కృషి ఆరంభమైనది. దీనిని ఒకఆర్థికకార్యక్రమమనుటకంటె ఉత్కృష్టము, ఉదాత్తము అయిన మహోద్యమమని వర్ణించుట సమంజసము.

కళాసమన్వితమైన చేతిపరిశ్రమ లనగా నేమి ? వీనికిని, కుటీరపరిశ్రమలు మరియు చిన్నతరహా పరిశ్రమలు అని పిలువబడువానికిని మధ్యగల తేడా ఏమి ? చిన్నతరహా పరిశ్రమ లనగా 10 నుండి 50 వరకు శ్రామికుల నియోగించు పరిశ్రమ లని 1949-50 నాటి ఫిస్కలు కమీషను తమ నివేదికలో నిర్వచించిరి. కుటీరపరిశ్రమలు ఒక కుటుంబము

లోని వ్యక్తుల శ్రమతోడనే నిర్వహింపబడునవి కుటీర పరిశ్రమలకు కావలసిన పెట్టుబడిమొత్తము ఒకలెక్క లోనిది కాదు. కాని చిన్నతరగతి పరిశ్రమలకు కొద్దిగనో, గొప్పగనో కొంతపెట్టుబడి కావలసియుండును ఇంతేగాక చిన్నతరగతి పరిశ్రమలలో యంత్రములనుకూడ వాడ వచ్చును ప్లానింగు కమీషనువారి నిర్వచనప్రకారము చిన్న తరగతి పరిశ్రమలు పట్టణములందు స్థాపింపబడి, పూర్తిగ లేక కొంతవరకు యంత్రములపై ఆధారపడుచు, సుమారు 50 వరకు పనివాండ్రను నియోగించి వస్తూత్పత్తిని కావించు నవి విద్యుచ్ఛక్తిని గాని, యంత్రములనుగాని యెంత మాత్రము వాడని పక్షమున అవి సుమారు 100 వరకు కార్మికుల నియోగింపవచ్చును. చిన్నతరగతి పరిశ్రమలకు పెట్టుబడి ఐదులక్షల రూపాయలవరకు ఉండవచ్చును. ఇట్లే కుటీరపరిశ్రమలు గ్రామీణమైన వనియు, ఆయా కుటుంబ ములందలి వ్యక్తుల కృషితోనే అందలివస్తువులు తయారగు నవనియు ప్రణాళికాసంఘమువారి నిర్వచనము.

కాని చేతిపరిశ్రమల నిర్వచనమువేరు. అవి యంత్ర సహాయమును స్వల్పముగ పొందిననూ పొందవచ్చును. లేదా అవి పూర్తిగ చేతిపనులే కావచ్చును. ఏమైనను ఇవి సౌందర్యసమన్వితమైన వగుటయే వీనికిగల ప్రత్యేకత.

ప్రాచీన భారతీయ పారిశ్రామిక కళాకారుడు తాను జగత్కా రకుడగు విశ్వకర్మవంశీయుడనని భావించుకొనెను. అందా నికి ఆటపట్టులు, ఆనందానికి నిలయములు నైన కళాత్మకము లైన చేతిపనులే పారిశ్రామికకళలు

రెండవ అధ్యాయము

# వెనుకబడిన దేశముల ఆర్థికవ్యవస్థలో చేతిపరిశ్రమల స్థానము

గాంధీమహాత్ముడు తన రాజకీయ, ఆర్థిక సిద్ధాంతముల అవధుల నేమాత్రము యెఱుంగక వానిని ఇష్టము వచ్చినట్లు రూపొందించువ్యక్తి యని ఆయనను భారతీయ మేధావులు విమర్శించిన దినములు లేకపోలేదు. అవసరమున్నను, లేకున్నను పాశ్చాత్యభావములను ఎఱువుతెచ్చుకొను దురభ్యాసము మన మెంత త్వరగా పోగొట్టుకొనిన అంతమంచిది. వాస్తవమునకు విశేషముగ ఉద్యోగావకాశములను కల్పింపగల ఆర్థికప్రణాళికను బాపూజీ ఆర్థికసిద్ధాంతములు సూచించుచున్నవి. భారతీయ అర్థశాస్త్ర చరిత్రలో గాంధేయ ఆర్థికవాదమునకు ప్రముఖస్థానము కలదు.

నేడు ఆసియాదేశములందలి ఆర్థికవ్యవస్థను పీడించుచున్న భయంకరవ్యాధి నిరుద్యోగము లేక అసమగ్రమైన

ఉద్యోగస్థితి యని చెప్పవచ్చును. పాశ్చాత్య ఆర్థికనిపుణులు నిరుద్యోగమును తొలగించుటకు భారీయెత్తున మన యంత్ర పరిశ్రమలు వృద్ధిపొందవలె నందురు. కాని యూరపు చరిత్రలో పారిశ్రామిక విప్లవముతోపాటు వ్యావసాయికరంగమునగూడ విప్లవకరమైన ఆర్థిక పరిణామములు కలిగెనను విషయమును మఱువరాదు. ఇపుడు మనదేశములోని వ్యావసాయికరంగపురోగమన మేమంత విప్లవకరమైన మార్గమున జరుగుటలేదు ఇట్టి పరిస్థితులలో నిరుద్యోగమును తొలగించుటకు, అసమగ్రమైన ఉద్యోగస్థితిని తొలగించుటకు మార్గము కుటీరపరిశ్రమలను, పారిశ్రామిక కళలను పునరుద్ధరించుటయే ; అనగా బాపూజీ ఆర్థికవిధానమే ప్రస్తుతపరిస్థితులలో మనకు శరణ్యము

భారతదేశమువంటి ఆసియాదేశములలో పెట్టుబడికి కావలసిన ధన మంతగా లభించుటలేదు. అందువలన భారీ ఎత్తున పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగమును తొలగించుట సాధ్యము గాదు. వ్యావసాయికరంగమునందలి అనాదిగ వచ్చుచున్న మనసంప్రదాయపద్ధతుల నంత సులువుగ వదలలేముగావున అది అంత త్వరితముగ నభివృద్ధి నొందజాలదు ఎటు జూచినను కుటీరపరిశ్రమలను, గృహపరిశ్రమలను, గ్రామీణపరిశ్రమలను, చిన్నతరగతి పరిశ్రమలను,

చేతిపరిశ్రమలను పునరుద్ధరించి అభివృద్ధి చేయవలసిన అవసర మెంతేని కానవచ్చుచున్నది.

మనదేశమునందలి కుటీర, గ్రామీణ పరిశ్రమలలో రెండుకోట్లకుపైగా జనులు నిమగ్నులై యున్నట్లు తెలియుచున్నది ముఖ్యముగ కళాసమన్వితములైన చేతిపనులు ఎందఱకో ఉపాధి కల్పించుచున్నవి. లోహపరిశ్రమలందు నలుబదిలక్షలు, తోళ్ల పరిశ్రమలో ఇరువదియైదు లక్షలు, జాడీలు కూజాలు తయారుచేయుట మున్నగు ఇతర చేతి పరిశ్రమలలో నొక్కొక్కదానియందు ఇరువదిలక్షలమంది జనులు నియోగింపబడినటుల అంచనా వేయబడినది. కేవలము నేతపరిశ్రమయందు ఏబదిలక్షలమంది కలరు. మన దేశమునందు ఉత్పత్తియైన బట్టలో నాల్గవభాగము చేతిమగ్గములపైననే తయారగుచున్నదనుట, నేటి యంత్రయుగమున చేనేత పారిశ్రామికులకు ఎంతటి గర్వకారణము! కుటీరపరిశ్రమలు, చేతిపరిశ్రమలు మనదేశపు జనాభాలో పెక్కుమందికి ఉపాధిని కల్పింపగలవను అంశమును రుజువుచేయుటకు విశేషించి చెప్పనవసరము లేదు. మన ఆర్థికవ్యవస్థను సరియైనపునాదులపై నిర్మించవలెనన్న కుటీర పరిశ్రమలను, పారిశ్రామిక కళలను ఉద్ధరించి వాటిని వ్యావసాయిక రంగమునకు సహాయకారులుగ జేయవలసి

యున్నది. అఖిలభారత గ్రామీణ పరిశ్రమల సంఘము ఈ సందర్భమున చేసినకృషి ఎంతయూ శ్లాఘనీయము. బాపూజీ సిద్ధాంతములే ఈసంఘ కార్యకలాపములకు మార్గ దర్శకము లైనవి.

చేతిపరిశ్రమలు, కుటీరపరిశ్రమలు జనులకు వారి గృహములందే పనులు కల్పించును ఇట్టిపరిణామము పారి శ్రామిక వికేంద్రీకరణమునకు దారి తీసి మనఆర్థికవ్యవస్థకు సమగ్రమైన రూపము నిచ్చును పారిశ్రామిక కళాకారు లలో గల నేర్పరితనము, కళానిపుణత సార్థకమై వారి ఉపాధి కొకమార్గ మేర్పడును, వారికాలము సక్రమముగ వినియోగపడును, గ్రామములందలి ఈవ్యక్తుల కొనుగోలు శక్తి ఎక్కు వగును.

చేతిపరిశ్రమలను సహకారపద్ధతిని ఉద్ధరించవలెనని 1947 వ సం॥మున క్రొత్తఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ కార్మికసంఘ సభలో తీర్మానించబడినది. పరిశ్రమలలో మనము చాల వెనుకబడి యుండుటచే పారిశ్రామికముగ అభివృద్ధి నొందిన దేశముల ఆర్థికవ్యవస్థకంటె మన ఆర్థిక వ్యవస్థ చాల వెనుకబడియున్నది. కాని మన చేతిపరిశ్రమ లలో తయారయిన వస్తువులకు విదేశములలో విశేషమైన

గిరాకీ గలదు ఈకారణమున మనఆర్థికవ్యవస్థ చక్క బడుటకు కావలసిన విదేశీద్రవ్యమారకము మనకు లభించు చున్నది నిరుద్యోగము, అసమగ్రమైన ఉద్యోగమువలన మనప్రజలలో ముఖ్యముగ గ్రామీణులలో కొనుగోలుశక్తి చాల తక్కువగ నున్నది. ఈపరిస్థితులలో పారిశ్రామిక కళలు దేశముయొక్క ఆర్థికస్థితిని పటిష్ఠము చేయుటలో ప్రముఖపాత్రను వహింపగలవు

మూడవ అధ్యాయము

# వెనుకబడినదేశముల ఆర్థికప్రణాళికలలో పారిశ్రామిక కళలు

ఆర్థికప్రణాళికలద్వారా ఆర్థికప్రగతి సాధించవలెనను సిద్ధాంతము ఎల్లరిచే అంగీకరించబడినది. ఆర్థిక పునర్ని ర్మాణపు శాశ్వతోపయోగములను దేశమునకు సమకూర్చ వలెననిన జనానీకమున కంతటికిని చాలినంత కొనుగోలుశక్తి కలుగురీతిని ప్రణాళికా కార్యక్రమములను రూపొందించ వలెను. సామాన్య ప్రజానీకమునకు ఆర్థిక సౌష్ఠవమును చేకూర్చుటే మనప్రణాళికల ముఖ్యలక్ష్యము.

చేతిపరిశ్రమలను ఎట్టి ఆర్థిక ప్రణాళికల ద్వారా పెంపొందింప నగునను అంశమును ఇటీవలనే ఆర్థికనిపు ణులు విపులముగా పరిశీలింప ప్రారంభించినారు. పారి శ్రామికకళల పునరుజ్జీవమునకు ఎట్టి ప్రభుత్వయంత్రాంగ

మును సమకూర్పవలెనను విషయముగూడ అట్టిపరిశీలనకు గురియైనది.

చేతిపరిశ్రమలకు ప్రణాళికలో ప్రముఖస్థాన మిచ్చి, నంతమాత్రమున సమస్య అంతయు పరిష్కారము గాదు కుటీరపరిశ్రమలు, చిన్నతరహా పరిశ్రమలు అభివృద్ధి చెందుటకు మనము వేసిన ప్రణాళికాంశములతో పోల్చి నపుడు చేతిపరిశ్రమల సముద్ధరణకై మనము సంకల్పించిన చర్య లెవ్వి యను విషయమును యోచించవలసియున్నది. చేతిపరిశ్రమలలో నియమింపబడిన కళాకారుల సంఖ్య ఎంత ? ప్రత్యేకమైన కళాసమన్వితములైన చేతిపనుల ప్రత్యేకసమస్య లేవి ? అను విషయములను కూలంకష ముగ పరిశోధించి నివేదికలను తయారుచేయవలసియున్నది.

మనపారిశ్రామికకళలను ప్రత్యేకముగ నెదుర్కొను చున్న ఆర్థికసమస్యలు (1) ముడిసరకుల సరఫరా (2) గిరాకీకి తగినంతగ సరకు ఉత్పత్తిని పెంపొందిం చుట (3) మూలధన సేకరణ (4) సరకుల నాణ్యతను కాపాడుట (5) క్రియ, విక్రియ సమస్యలు మున్నగునవి.

పూజ్య బాపూజీ ఆదేశముల ఫలితముగ వర్ధాలో గ్రామీణపరిశ్రమల ప్రదర్శనశాల స్థాపించిన నాటినుండియు

కుటీరపరిశ్రమ, చేతిపరిశ్రమల పునరుజ్జీవమునకు సరియైన కృషి ఆరంభమైనది. చేతిపరిశ్రమల పునరుద్ధరణకు మనము చేయవలసినది ఆయాసరకుల నాణ్యతను పెంపొందించుట అనేకచేతిపరిశ్రమలు తమనాణ్యతను నిలుపుకొనజాలకున్నవి ఇది మిక్కిలి శోచనీయమయిన విషయము

గిరాకీని అభివృద్ధి చేయుటకు, ఉత్పత్తిని పెంపు చేయుటకు ప్రభుత్వము, ఆ యా చేతిపరిశ్రమల పునరుద్ధరణకై పాటుపడుచున్న సంస్థలు అవలంబింపవలసిన విధానమెట్టిది ? అనునది మరియొక ముఖ్యాంశము.

విదేశములలో మంచి గిరాకీగల వీటి సముద్ధరణకు శాశ్వతప్రదర్శనశాలలు, పారిశ్రామిక ప్రదర్శనములు ఎంత వరకు సహాయపడగలవు ? అనునది మరియొక అంశము.

మధ్యవర్తులైన వర్తకుల చేతులలో ఈకళాకారులు నలుగుచున్నారు కావున వారిఆర్థికసమస్యల పరిష్కరించుటకు సహకారపద్ధతిని స్థాపించబడు క్రియవిక్రియ సంఘములను ఎట్లు నడిపించవలెను ? ప్రభుత్వము ఈసందర్భమున చేయగల ఆర్థికసహాయ మెట్టిది ? అనునవి అన్నిటికన్న ముఖ్యవిషయములు.

దేశపు ఆర్థికవ్యవస్థలో చేతిపనులకు ముఖ్యస్థానము గలదు. మొన్నటివరకు మనము వాటి అందచందాలుచూచి, మురిసిపడెడివారము. ఈనాడు అంతేకాక, కొంతవరకు వాటిని సామాన్యప్రజలు ఉపయోగించునట్లు చేయవలయును వస్తువుల పరిమాణము తక్కువయినను, వాటి ప్రాచీన, సంప్రదాయము, కళానైపుణ్యము మనము మరవరాదు. యంత్రయుగములో చవుకబారు "డిజైను"లు తీసికొనిన, చేతిపనులకు కూడరాని నష్టముచేసిన వారాయెదము.

మన మొదటి రెండు పంచవర్ష ప్రణాళికలలోను, మూడవ ప్రణాళికయందును చేతిపరిశ్రమలకు సముచిత స్థాన మొసంగియున్నాము భారతదేశమునందలి వివిధ పారిశ్రామిక కళలలో ముఖ్యమైన వాటినిగూర్చి ఈసందర్భమున పరిశీలించుట ఆవశ్యకము

నాల్గవ అధ్యాయము

# కొన్ని భారతీయ చేతిపరిశ్రమలు

మొహంజొదారో, హరప్పా త్రవ్వకములలో బయల్పడిన ఇత్తడిబొమ్మల సౌందర్యము పుత్తడిబొమ్మలను మఱపించుచున్నవి. బౌద్ధనాగరకత విలసిల్లిన ప్రాచీన భారతమున బంగారు, వెండి లోహములలో పోతపోయబడి రత్నములు, కెంపులు పొదగబడిన నిలువెత్తు బుద్ధవిగ్రహములు నిర్మింపబడి ఆనాటి కళాకారుల నైపుణ్యమునకు తార్కాణములై అలరారినవి. చోళులకాలమునాటి ఇత్తడి విగ్రహములు ప్రపంచమునందలి అన్ని కళాప్రదర్శన శాలలయందును నేడు కాననగును ఇనుము, ఇత్తడి, రాగి, వెండి, బంగారు లోహములతో నిర్మించబడిన దేవతా మూర్తులు నాటివలె నేడును తయారు చేయబడుచున్నవి మన సాంస్కృతిక జీవితముతో పెనవేసుకొనిపోయిన సంప్రదాయ మిది. ఆనాటిమూర్తులలో సౌందర్యమునకు, భక్తిప్రపత్తులకే ప్రాధాన్యము. కళాతృష్ణతోకూడిన హృద

యము నుత్తేజపరచు ప్రయోజనమునకై ఇవి ఉద్దేశింప బడినవి సమభంగ, అభంగ, త్రిభంగ, అతిభంగాది రీతు లలో, అభయ, అంజలి, ధ్యాన, ధర్మచక్ర, వరద, వ్యాఖ్యా నాది హస్తవిన్యాసములతో శిల్పశాస్త్రములలో వివరించినరీతి నిర్మింపబడిన దేవీ, దేవతామూర్తులు ఏలోహమునందైనను, ఏనాడైనను చూపరుల ముగ్ధుల చేయగలిగి యుండును. దేవీ, దేవతామూర్తులేగాక గంధర్వ, కిన్నర, అప్సరసాది మానవేతరమూర్తులు, దీపకన్యలు, ప్రకృతిలో కానవచ్చు సహజభంగిమలలో జంతుజాలము ఆనాటి కళాకారులచే తయారు చేయబడుచుండెడివి. బెంగాలున పాలరాజవంశీ యుల కాలము, దక్షిణమున చోళ, పల్లవరాజుల కాలము లోహపు పనికి ప్రసిద్ధికెక్కిన రోజులు. నేపాల్, టిబెట్టు లలో బౌద్ధము వ్యాపించి లోహపుపని అచ్చటకూడ కాల క్రమమున విలసిల్లెను. తార, అవలోకితేశ్వరుడు మున్నగు మూర్తులు, వివిధ భంగిమలలో బోధిసత్త్వులు, బుద్ధులు ఈదేశమునందలి లోహపు పనియందు కన్పట్టుచుందురు. గాంధార శిల్పప్రభావము, చైనా కళారీతుల ప్రాబల్యము ఈదేశపు శిల్పముపై ఒడినది. దక్షిణభారతదేశపు కళా విన్యాస మీకళయందు ముఖ్యముగ నటరాజ, దీపకన్యకల విగ్రహములయందు కాననగును.

లోహపు పనియందు తరువాత పేర్కొనదగినవి నగలు. భారతీయవధువు దాల్చు మంగళసూత్రము మొదలు వారమునందలి ఏడురోజులలోను రోజుకొక్క రీతి స్త్రీలుధరించు వివిధములగు నగలు, శిరమున కేశములపై ధరించు నాగ రము, చంద్రవంకనుండి కాలివేళ్ళపైనుండు చుట్లవరకు ఎన్నియోరకములు గలవు మైసూరు, సవంతవాడి, విశాఖ పట్టణము, విజయనగరము అందమైన నగల తయారీకి చెప్పుకొనదగినవి. బంగారుపనితోబాటు ఎనామిల్ చేయుట కూడ పంజాబు, కాశ్మీరు నగలలో కన్పడును. ఢిల్లీ, లాహోరు పట్టణముల నగల పనితనము పంజాబు కళను పోలియున్నది. విలువైన రాళ్ళుపొదిగిన బంగారునగలు చేయుటకు రాజస్థాన్, మేవాడ్‌లను చెప్పవలసియున్నది. బరువైన నగలకు హిమాలయ ప్రాంతములు, అస్సాం, మణిపురము పెట్టినదిపేరు. ఆధునికయుగ నాజూకునగలకు బొంబాయి పేరులోనికి వచ్చుచున్నది. ప్రాతకాలపు నగలను అనుకరించుచు నేటి అలంకరణపద్ధతులకు తగినట్లు మార్పిచేయుటయందు ఢిల్లీ, జయపూర్, లక్నో నగరములు ముందంజ వేయుచున్నవి

ఈసందర్భమున చెప్పుకొనదగిన ఒకకళ వెండి నగిషీపని. సన్నగాతీసిన వెండితీగతో కళాకారుడు అద్భుత


మైన సృష్టి చేయును. ఒరిస్సాయందలి కటకము ఈపనికి మిక్కిలి ప్రసిద్ధి. తరువాత ఆంధ్రదేశమునందలి కరీంనగరమును చెప్పవలెను నగిషీ చేసిన ఈవెండివస్తువులలో సౌందర్యము, ప్రయోజనముగూడ మేళవించినవి చిలుక, నెమలి ఆకారములలో అందమగు అత్తరుదాన్‌లే గాక, చక్కని తమలపాకుల పెట్టెలు, నేటి నాగరకత కనుగుణముగ పౌడరుడబ్బాలు, సిగరెట్ కేసులు, ఆష్ట్రేలు గూడ కరీంనగరమున తయారుచేయబడుచున్నవి

బంగారు, వెండి లోహములలో తయారగు పాత్రికలు, పళ్లెరములు సంస్థానాధీశుల కాలమున సహజముగ గిరాకీ కలిగియుండినవి పానపాత్రికలపై హుక్కాదాన్‌పై ఆనాడు ఎంతేని మోజు చూపెడివారు. కాశ్మీరు, జయపూర్, లక్నో, తంజావూరు, గుజరాత్, బెంగుళూరు ఈసందర్భమున పేర్కొనదగును. పళ్లెరములు తయారుచేయునపుడు తక్కువరకపు ప్రాథమికలోహముపై వెండి, బంగారపు నగిషీపూతపనికావించిన శిల్పి బిద్రీకళను సాధించుచున్నాడు. నేటి ఆంధ్రదేశమందలి హైదరాబాదునగరము బిద్రీపరికరములకు ప్రసిద్ధి తుత్తునాగము, కొన్ని ఇతరలోహములు చేర్చిన మిశ్రమలోహము దట్టమైన నలుపురంగులోనికి సంప్రదాయ రసాయనిక ప్రక్రియలవలన తెచ్చి దానిపై

వెండినగిషీపని చేసినయెడల అది చూడముచ్చటగ నుండును. ఆభరణపుపెట్టెలు, టాయిలెట్ భరిణెలు, గాజులు, పూల కూజాలు, పళ్ళెరములు, వ్రాతబల్ల పరికరములు, షేర్వాణీ గుండీలు, మొదలగు అందమయిన ఉపయోగకరములగు బిక్రీవస్తువులెన్నియో వచ్చుచున్నవి. లక్నో, ముషీరాబాద్‌లు గూడ ఈకళకు నిలయములు.

ఇత్తడి, రాగి, కంచుపాత్రలు ప్రతిభారతీయ మధ్య తరగతి గృహమున కన్పించును కాశీ, అహ్మదాబాదు, పూనా, నాసిక్ నగరములు ఇత్తడిపాత్రల తయారీకి పేరు గల కేంద్రములు. ఇత్తడిపాత్రలపైచేసిన నగిషీ అలంకరణమునకు మొరాదాబాద్, కాశ్మీరులు ప్రఖ్యాతి చెందినవి.

అణుయుగమున ఖడ్గము, కైజారు, డాలులకు స్థానము లేనిమాట నిజము. అయిననూ ఆయుధములను తయారుచేయుటయందును భారతీయ కళాకారులు గతమున శిల్పమును ప్రదర్శించియుండిరి. 1873 సం॥న వియన్నా ప్రదర్శనమునకు జయపూర్ మహారాజు పంపిన అంకుశము కళాతృష్ణగలవారి హృదయములను ఆకర్షించినది. అడ కత్తెరలు, కత్తెరలు, కత్తులు తయారు చేయుటయందే నేటి పనివాడు తనకళను ఈసందర్భమున అవసరమున్నంత వరకు చూపగలడు.



పేము కుర్చీలు–సోఫాలు

ఐదవ అధ్యాయము

# వడ్రంగము

మన ప్రాచీననగరములలో మహాభవన నిర్మాణమున ముఖద్వారముల తోరణములు కూర్చుటయందును, రథముల నిర్మాణమునందును వడ్రంగము సాధించిన ఉత్కృష్టస్థాయి మనకు గోచరించును. మొగలుల కాలమున మిగుల సౌఖ్యమును గూర్చు ఆసనములకు, తల్పములకు గిరాకీ ఏర్పడుటతో వడ్రంగము ఉపయోగకరమైన వస్తువులను తయారుచేయుటయందు మరియొక అడుగు ముందుకు వేసెను. ఇంగ్లీషువారి హయాములో పాశ్చాత్య పద్ధతిని కుర్చీలు, బల్లలు, మంచములు మున్నగువానిపై మోజు ఏర్పడి వడ్రంగము నిత్యజీవితములో అవసరమయిన వస్తూత్పత్తికే అంకితమై పోయెను. 16, 17, 18 శతాబ్దములలో గోవా ప్రాంతపు వడ్రంగులు కుర్చీలు, బల్లలు, మంచములు మున్నగునవి తయారుచేయుటయందు ప్రిద

ర్శించుచుండిన శిల్పనైపుణ్యమును పాశ్చాత్యయాత్రికులు ఎంతగనో పొగడిరి. యూరపుఖండపు వివిధ ప్రదర్శన శాలలయందు ఇవి కనపడును. నల్లచేవ, ఏబొనీ, టేకు వంటి కలపను వాడుచు అందమగు లక్కపని అందందు పొదిగి దంతపుపనితో కూడిన అలంకరణవలన వా రావస్తువుల కొక వింతసొబగును కూర్చుచుండిరి.

ప్రాచీనకాలమునుండి నేటివరకును భారతదేశపు వడ్రంగపు పనితనముయొక్క పరిణామమునుగూర్చి ప్రస్తావించునపుడు మొట్టమొదట వివరింపవలసిన అంశము సంగీతవాద్యముల తయారీ. శిల్పసౌందర్యమునకు, పనితనమునకు పేరుగాంచిన వివిధ వాద్యములను నాటినుండి నేటివరకు భారతీయ కళాకారులు తయారు చేయగలిగి యున్నారు. వివిధములగు భారతీయ సంగీత వాద్యములు 500 వరకు గలవు. వివిధ తరగతులకు చెందిన వీణెలు, వాయులీనములు, మృదంగములు మొదలగు వాద్య విశేషములు అజంతా చిత్తరువులందు మనకు కాన్పించును. ముఖ్యముగ వీణెలు తయారు చేయుటయందు సింహపుతల మరియు వీణబుర్రకు మలచు దంతపు నగిషీపని మొదలగున వన్నియు ఎంతయో రమ్యముగ నుండును. సాధారణముగ సొరకాయ ఆకారముననుండు వీణబుర్రకు చక్కని

వర్ణమున చిత్రాలంకరణము చేయుదురు. వెండి నగిషీపని, దంతపు నగిషీపని వీణయొక్క అనేకభాగములందు కన్పట్టును. దక్షిణమునచేయు వీణలకు ఎక్కువగ పనసచెక్క వాడుదురు. ఈనాడు వీణెలను ముఖ్యముగ తయారుచేయు నగరములు కలకత్తా, ముషీరాబాద్, లక్నో, కాశీ, రామపురము, ఢిల్లీ, అమృతసరము, మీరజ్, తంజావూరు, లాహోరు. ఆంధ్రదేశమున ఇందుకు పేర్కొనదగిన కేంద్రములు బొబ్బిలి, పిఠాపురము, మచిలీపట్టణము.

చేతిపరిశ్రమలలో వడ్రంగమును ఒక ఉన్నతమైన స్థాయికి కొనిపోయిన కీర్తి వెనుకటి కాశ్మీరు, గుజరాతు, రాజస్థానము, మైసూరు, తిరువాన్కూరు సంస్థానములకు దక్కును. ఫల పుష్ప లతాదులు చెక్కిన కాశ్మీరు పనితనము విశ్వవిఖ్యాతిని పొందినది. శ్రీనగరు సరస్సులపై తేలియాడు నావికాగృహములు కళానిలయములు. రాజస్థానమున రాజభవనములలో కావింప బడిన చెక్కడపుపని, గుజరాతు, కథియవాడలలోని దేవళములయందు కాన్పించు అలంకరణము, దక్షిణ భారతమునందలి దేవాలయముల రథములు ఈకళాపోషణమునకు చక్కని నిదర్శనములు. చేతికర్రలు, పెట్టెలు, బల్లలు, కుర్చీలు, మంచములు, తెరలు మొదలగు నవీనకాలపు ఉపభోగ్యవస్తువులను తయారు

21899

చేయుటలో నేడు పంజాబున భేరా, అమృతసరము, ఉత్తర ప్రదేశమున నగీనా, షాజీపూరు, లక్నోలు, రాజస్థానమున జోద్‌పూర్, కాశ్మీరు, గుజరాతులలో అనేక కేంద్రములు పేరుగలవి. తిరుపతి, తిరువనంతపురము, మధుర దక్షిణ భారతమున చెప్పుకొనవలసిన పట్టణములు తిరువాన్కూరులో కొబ్బరికాయ పెంకు నుపయోగించి యెన్నియో వస్తువులు తయారుచేయుదురు

చందనము లేక గంధపు కర్ర నుపయోగించి చేయు పనికి అహ్మదాబాదు, సూరతు, కనరా, కోయంబత్తూరు, మధుర, మైసూరు, తిరువాన్కూరు, తిరుచునాపల్లి, తిరుపతులు పేర్కొననగును వీటన్నిటియందు మైసూరు మిన్న యని చెప్పవచ్చును 1871 సం॥ మున ఇంగ్లండులో జరిగిన కళాప్రదర్శనమునాటినుండియు ఇతరదేశము లన్నిటిలోను మైసూరు చందనపుకర్ర పనితనమునకు గొప్ప పేరు వచ్చినది

ఆరవ అధ్యాయము

# ఆ ట వ స్తు వు లు

మానవసమాజపు చరిత్రలో ఆటబొమ్మల కొకవిశిష్ట మైన స్థానము గలదు. చక్రవర్తి కొలువు, అందు రాణివాసమున చెలికత్తెలుగ నున్న అనేక కన్నియల రూపములు చిత్రించు బొమ్మలు జపాను ఆడపిల్లల నలరించును. ఇట్లే జపాను బాలురు యోధుల బొమ్మలవలన ముగ్ధు లగుదురు. 1789 సం॥న ప్రజ్వరిల్లిన ఫ్రెంచి విప్లవజ్వాలలో ఒక వింతరకపు ఆటబొమ్మలు ఫ్రెంచిపిల్లలకు లభించినవి. ప్రభువంశీయుల బొమ్మలతో ఆడుకొను విప్లవకారుల పిల్లలు వధ్యస్థానమునందలి దోషులుగ నాబొమ్మల నుంచి ఒకఆటబొమ్మ అడకత్తెరతో వానికుత్తుకల నుత్తరించుచుండిరి. నేటిసమాజమున ఆటబొమ్మలకు మున్నెన్నడూలేని ఒక క్రొత్తస్థానము లభించినది. పారిశ్రామిక రంగమునందలి శాస్త్రీయవిధానముల నుదహరించు విద్యుచ్ఛక్తి కేంద్రములు

మరియు అనేక వస్తూత్పత్తి విధానములు బొమ్మలుగ తయారు చేయుటకై ఉత్పత్తి పరిశోధనకేంద్రము మాస్కో సమీపమున రష్యాలో గలదు.

భారతీయ సంస్కృతియందు ఆటబొమ్మలకు గల స్థానము చాల ప్రాచీనమైనది. సింధు నాగరికతయందు చిత్రవిచిత్ర రీతుల అనేకములైన ఆటబొమ్మ లుండినవి. సంస్కృత మహాకవి శూద్రకుడు రచించిన మృచ్ఛకటిక మను నాటకము నాయకుని కుమారు డాడుకొనుచుండిన మట్టిబండిపై ఆధారపడి యున్నది. దక్షిణభారత దేశ ములో బొమ్మల కొలువు పండుగకు స్త్రీలు, పిల్లలు ఎంతటి ప్రాధాన్యత నొసంగుదురో మన కందఱకు తెలిసినదే !

భారతదేశమునందలి వివిధప్రాంతములలో నాడు నేడు చేయబడుచుండిన వివిధములగు ఆటబొమ్మలు ఆయా ప్రాంతములకు చెందిన ప్రత్యేకతను ప్రకటించుచున్నవి. రాజస్థాన్ వనితలలో కాన్పించు లావణ్యము, బెంగాలీ కన్ని యల వదనమున గోచరించు ముగ్ధమోహనత్వము, మహా రాష్ట్రస్త్రీల అంగసౌష్ఠవము, తమిళ పడతుల చలాకీతనము, ఆంధ్రదేశపు ఆడపడచుల అందము ఆయా ప్రాంతముల ఆటబొమ్మలలో చూడనగునని డోంగేర్ కేరీ చెప్పినది

యెంతయో సత్యము. రాజస్థానపు ఆటబొమ్మలకు ఆభరణములు, వస్త్రాలంకరణములపై మోజు హెచ్చు. ఎఱుపు, నీలము యూనిఫారములలో ఈస్టిండియా కంపెనీ జీతగాండ్రను జ్ఞప్తికితెచ్చు బొమ్మలను బెంగాలులో చేయుదురు. ఆటబొమ్మలలో కోటను చూచిన మహారాష్ట్రబాలుని హృదయము ఉరకలు వేయును. ద్వారకయు, మధురయు బృందావన సంప్రదాయమును జ్ఞప్తికి తెచ్చును. అచ్చటి బొమ్మలలో ఎచ్చట చూచినను నారి, మురారి ప్రత్యక్షము ; ఆంధ్రదేశపు బొమ్మలలో గ్రామీణ సంప్రదాయములకు ప్రాధాన్యత కన్పడును. బొమ్మల పరిశ్రమ ఆయా ప్రాంతము అందు దొరకు ముడిసరకులపై ఆధారపడియుండును. కాగితము, బట్ట రాజపుత్రస్థానమునందును, గ్వాలియర్ చుట్టుపట్ల రాయి, కలప, ఉత్తరప్రదేశ్, బెంగాలులో మట్టి, ఆంధ్రలో మట్టి కలప, మైసూరులో చందనపు కర్ర వాడబడును.

కృష్ణనగరము, కలకత్తా, పూనా, లక్నోలు మట్టిబొమ్మలకు పేర్కొనబడినవి. మట్టిబొమ్మలపై అందమైన రంగులు వేయుదురు. సమంతవాడి, ఆగ్రా, లక్నోలలోను, బెల్గాము జిల్లాయందును మట్టితో తయారు చేయబడి చాల సహజమైన రంగులు వేయబడిన పండ్లబొమ్మలు తయార

గును లక్నో పండ్లబొమ్మలు భారతదేశమునందు తయారు కాబడు పండ్లబొమ్మలలో కెల్ల శ్రేష్ఠమైనవని విజ్ఞుల అభిప్రాయము. పోత నమూనాలవలన మట్టిబొమ్మలు విరివిగ తయారు చేయుటకు వీలు కలుగుచున్నది. దేవీ, దేవతా మూర్తులు, జంతువులు, పక్షులు, పండ్లు, వివిధ వృత్తులకు చెందిన గ్రామీణులు, పడతులు మట్టిఆటబొమ్మలలో సర్వసామాన్యముగ కన్పించు స్వరూపములు

రంగులు వేయబడిన మట్టి, ఇత్తడి బొమ్మలకు వారణాశి అనాదినుండియు ప్రసిద్ధి కెక్కియున్నది లేకు, ఎర్రకర్రల నుపయోగించి బొమ్మలు చేయుటలో ఈనాడు దక్షిణభారతమున మధురకు ఖ్యాతి లభించినది బెంగాలు కర్రబొమ్మలపై లక్కపూత గలదు

లోహపు బొమ్మలు, ఇత్తడితో చేయబడి బరువుగ నుండును. ఎద్దుబండ్లు, దేవాలయపు రధములు, పురాణేతిహాసములందలి ఘట్టములు, గ్రామీణుల, పట్టణవాసుల కార్యక్రమములు ఈలోహపు బొమ్మలలో ప్రతిబింబించును వీటన్నిటికి మించి బాలిక లాడుకొనుటకై తయారుచేసిన ఆటవస్తువులు, ఇత్తడి వంటసామానులు ఆటవస్తువులలో కెల్ల ప్రాముఖ్యమైనవి. బంకూరా మరియు పరిసరప్రాంత


ములలో నివి విరివిగ చేయబడుచున్నవి. భారతదేశమున అన్నిపుణ్యక్షేత్రములందును వీనికి గిరాకీ హెచ్చు.

ఆంధ్రదేశపు ఆటబొమ్మల పరిశ్రమకు విశ్వవిఖ్యాతి నిర్మల, కొండపల్లి బొమ్మలవలన లభించినది. సింహపురి బొమ్మలనుపేరున నెల్లూరులో వెలసినబొమ్మలు, బందరు పరిసరగ్రామములలో చేయబడు మట్టి, పేపరు మేషీబొమ్మలు ఆంధ్రలోని ఆటబొమ్మల పరిశ్రమకు మరి కొన్ని చేర్పులు. 'నిర్మల' పరిశ్రమకు నాల్గు శతాబ్దముల చరిత్ర గలదు. సహజమైన చెక్కచెదరనిరంగులలో జంతువులు, పక్షులు, కూరగాయలు, పండ్లు తయారుచేయుటకు ఇచ్చటి కళాకారులు పేరు గాంచియున్నారు. ఇటీవల అనేక ఉపభోగ్యవస్తువులను జేయుటనుకూడ వీరు ప్రారంభించి అలంకరణ భరిణెలు, మేజాబల్లలపై యుంచబడు చిన్న సైజు చిత్తరువులు, దీపస్తంభములవంటి వానిని గూడ తయారుచేసి విక్రయించుచున్నారు. మిక్కిలి తేలికగనుండు బూరుగు, పుణికి కర్రను వీరు వాడుదురు. చాలకాలము నిలుచు రంగులవలననేగాక వనమూలికల రసాయనములతో వస్తువుల కిచ్చు బంగారు వన్నెవలనగూడ ఈవస్తువులకు అందము, గిరాకీ లభించినది. విజయవాడకు 15 మైళ్ల దూరమునగల కొండపల్లి యను గ్రామములో తయారగు

బొమ్మలకు చాల ప్రఖ్యాతి గలదు. గ్రామీణ వాతావరణ మును ప్రదర్శించు ఈబొమ్మలు చాల ఆకర్షణీయముగ నుండును. ఇచ్చటి కళాకారులు రాజస్థానమునుండి వలస వచ్చినవారట. తిరుపతి మరియు పరిసర గ్రామములలో తయారగు ఎర్రకర్ర బొమ్మలు మానవ, దేవతా మూర్తులకు ప్రతులు. ఇది అంగుళమంత చిన్న సైజునుండి అడుగున్నర పెద్దసైజువరకు తయారుచేయబడుచున్నవి.

ఆటబొమ్మలు పిల్లలకై ఉద్దేశింపబడినను పెద్దవారిని గూడ ఆకర్షించును. కావున ఈపరిశ్రమకు చేతిపరిశ్రమ లలో విశిష్టమైన స్థానము లభించినది.

ఆధునిక విద్యావిధానములో ఆటవస్తువులకు ముఖ్య స్థానము కలదు. ఆటవస్తువుల ప్రదేశము పిల్లల మానసికాభి వృద్ధికి ఎంతయో తోడ్పడును. మనిషి జీవితములో, బాల్య దశ ఎంతో ముఖ్యమైనది. మనస్తత్వ శాస్త్ర ప్రకారము, స్థానిక పరివర్తనము పిల్లలకు సరిగా తెలియాలంటే, ఆట వస్తువులే ముఖ్యపాత్ర వహించును. ఆటవస్తువులతో ఆడు కొనుచున్నప్పుడు, పిల్లలలో ఒక ఉత్సాహము, ఉద్రేకము వచ్చును. కొన్ని ఆటవస్తువులకు చిన్నచిన్న యంత్రములు అమర్చుట వలన, అవి వాటంతట అవే తిరుగుచున్నందున పిల్లలకు అమిత ఆనందము కలుగును. బందరులో కాగితపు ముద్దతో నృత్యబొమ్మలుచేసి, వాటికి చిన్నస్ప్రింగు అమర్చి దానంతట అదే, యిటూ అటూ నృత్యముచేసే దృశ్యము పెద్దలను పిల్లలను రంజింపచేయును.



ఆట బొమ్మలు

ఏడవ అధ్యాయము


# లక్క-బొమ్మలు, సామాన్లు

అనేకరకముల ముచ్చటైన లక్క-సామాను దేశము నందలి చాలప్రాంతములలో తయారు చేయబడుచున్నది. వివిధములగు లక్క-వస్తువులు విరివిగ అనేకచోట్ల చేయ బడుచున్నప్పటికి, ఫర్నిచరుకు లక్కపూత పూయుపని కొన్నిపట్టణములకుమాత్రమే పరిమితమై యున్నది.

లక్క- కంకణములు తయారు చేయుటకు ఢిల్లీ, పంజాబు, లక్నో, కాశీ, పాట్నా, బెంగాలులు పేరుమోసినవి. పశ్చిమ భారతదేశమున పంచమహాలు జిల్లాలో తయారు చేయు లక్క- కంకణములనుగూర్చి ఏక్‌వర్త్ ప్రస్తావించెను. ఇచ్చటి కళాకారులకు కావలసిన లక్కను పరిసరారణ్యములనుండి భిల్లులు తెచ్చెదరు. కర్రతో చేసిన గాజులు, కంకణములపై లక్కను పూయు విధానమునకు మైసూరు,

బళ్లారి ప్రాంతములు, సూరత్, అహ్మదాబాదులు పేరుగాంచినవి. విరివిగ ప్రతియేట ఇతరదేశములకు ఎగుమతిచేయబడుచు విదేశములలో ఖ్యాతిపొందిన మన లక్కసామానులనేకములు గలవు ఆవస్తువులలో లక్కపూతపని చేసిన కర్రపెట్టెలు, పళ్ళెరములు ముఖ్యమైనవి అష్ట్రేలు, చిన్నచిన్న పెట్టెలు మున్నగు ప్రయోజనకరమైన, అందమైన చిన్న లక్కవస్తువులు చేయుటకు శ్రీనగర్ ఎంతో ఖ్యాతిగలది. నాణ్యతకును ఇవి మొదట చెప్పవలసిన వస్తువులు.

ఆంధ్రదేశమున ఏటికొప్పాక, నక్కపల్లి, నిర్మల్‌లు లక్కవస్తువులకు పెట్టినదిపేరు ఆదిలాబాద్ జిల్లాలో గుట్టలు, చిట్టడవుల పరిసరప్రాంతములనున్న నిర్మల్ చిత్రమైన రంగులతో విలసిల్లు చేతిపరిశ్రమల కాలవాలమైన గ్రామము. కొన్ని వనమూలికల సహాయమున సువర్ణమును ప్రత్యేక రసాయనిక ప్రక్రియద్వారా చేయవచ్చుననుభావము ప్రాచీన కాలమున ప్రబలముగ నుండెడిది. ఈ అభీష్టసిద్ధికి నిర్మల్ పరిసరప్రాంతములయందును కొన్ని రసాయనికప్రయోగములు చేయబడినవి. నిజమైన సువర్ణము లభింపకపోయినను, సువర్ణమును బోలిన రంగు శాశ్వతముగ నుండుటకు వీలైన రసాయనిక పదార్థము దొరకినది. చెక్కఫ్రేముల



నిర్మల్ కొయ్యబొమ్మలు



నవీన నిర్మల్ కళ

మీద ఈగ్రామమున జరుగు లక్కపూతపని, బంగారుపూత పని ఎంతయును విలువైనది. ఈకళయందు కుర్చీలు, బల్లలు, స్క్రీనులు, దివాన్లు, ప్రత్యేకముగ అజంతా శిల్పము అమర్చబడిన పైచెప్పిన వస్తువులు మెచ్చుకొనదగిన వస్తువులు.

ఏటికొప్పాక లక్కపనిలో బొమ్మల తయారీకి ప్రాముఖ్యత యివ్వబడుచున్నది ఏటికొప్పాక బొమ్మలలో పుణికి చెక్కమీద చేసిన లక్కపని చూపరుల దృష్టిని ఆకర్షించును.

ఎనిమిదవ అధ్యాయము

# దంతము, కొమ్ము వస్తువులు

క్రీస్తుపూర్వము రెండవ శతాబ్దానికి చెందిన సాంచీ శిలాశాసనము విదిశానగరముయొక్క దంతపు పనివారల వృత్తి సంఘమునుగూర్చి ప్రస్తావించుచున్నది. సింధు రాష్ట్రమున బ్రమనాబాద్ త్రవ్వకములలో దొరకిన దంతపు చదరంగపు పావులు ఎనిమిదవ శతాబ్దానికి చెందినవి గావచ్చును. అమృత్‌సర్, పాటియాలా, ఢిల్లీ, వారణాసి, లక్నో, ముర్షీరాబాద్, సూరత్, అహ్మదాబాద్, సతారా, తిరువాన్కూరు, విశాఖపట్టణము, విజయనగరం, మైసూరు పట్టణములు ఈ దంతపుపనితనమునకు శతాబ్దములనుండి ప్రఖ్యాతిని కలిగియున్నవి.

ఏనుగుదంతము నుపయోగించి కళాకారులు దేవీ, దేవతామూర్తులు, బొమ్మలు, దువ్వెనలు, గాజులు, అలంక


రణపు పెట్టెలు, ఆభరణపుపెట్టెలు, కాగితములు కోయుట కుపయోగించు పరికరములు మున్నగునవి తయారుచేయు దురు. బొమ్మలతీరుల వైవిధ్యము వర్ణించుట అసాధ్యము. అనేక పక్షులు, జంతువులు మున్నగువానిబొమ్మలు తయారు చేయుదురు. ఢిల్లీ, ముషీరాబాద్, మైసూరు, తిరువాన్కూ రులు దంతపు పనికి నేడు భారతదేశమున ఖ్యాతిగాంచిన రాష్ట్రములు. కొన్ని ఇతరరాష్ట్రములందును పరిశ్రమ వర్ధిల్లు చున్నను పనితనమునకు, నాణ్యతకు వీనిని చెప్పవలసి యుండును.

రాజస్థానమునందలి జోద్‌పూర్‌లో విరివిగ దంతపు గాజులు చేయుదురు. వంగదేశమున దంతముతో చేయబడిన హిందూదేవతామూర్తుల రూపములకు ప్రాధాన్యత హెచ్చు. కటకము, పూరీ నగరములలో దంతపుపని యెంతేని అభి వృద్ధి నొందుచున్నది. దక్షిణ భారతదేశమున తిరువా న్కూరులోను, మైసూరులోను ఎన్నోరకముల దంతపు వస్తువులు చేయబడుచున్నవి.

ఈపరిశ్రమకు ఆంధ్రలో చెప్పుకొనదగిన కేంద్ర ములు విశాఖపట్టణము, సికింద్రాబాద్. దేవతామూర్తులు, జంతువుల రూపములు విశాఖపట్టణమునందలి పనిలో కన్పిం

చును. మేజాబల్లలమీద దంతముతో చేయబడిన అనేక తీరు లతలు పొదగబడి చాలముచ్చటగ అలంకరణ గావించ బడుచున్నవి. మంచి గంధపు చెక్కపనిలో దంతపుపని గూడ కలిపి వస్తువులు చేయుపద్ధతి మరియొకటి. నల్లచేవ కర్ర, తాబేటిచిప్పలతో చేయు వస్తువులపైన చిత్రాతిచిత్ర మైన దంతపుపనులు పొదుగబడి ముచ్చటైన అలంకరణ వస్తువులుగ తయారగును. ఆంధ్రరాష్ట్రమునుండి ఎగుమతి చేయదగిన దంతపు వస్తువుల విలువ సంవత్సరమునకు సుమారు 50 వేల రూపాయలై యున్నది.

కొమ్మువస్తువులకు విశాఖపట్టణం, బరోడా, రాజ కోట, సూరత్, అహ్మదాబాద్, మధుర, మైసూరులు ఖ్యాతి నొంది యున్నవి. గేదెకొమ్ము హెచ్చుగ వాడబడుచున్నది. నెక్లెసులు, గాజులు, పమిటపిన్నులవంటి ఆభరణములు చేయుటలో గుజరాతు, బెంగాలు రాష్ట్రములకు ప్రత్యేకత గలదు. బరోడాలో చంచాలు, రాజకోటలో దువ్వెనలు, సూరత్, అహ్మదాబాదులలో పెట్టెలు, మధురలో జంతువుల బొమ్మలు, మైసూరులో చేతికర్రలకు పిడులు కొమ్మునుండి తయారుచేయబడు వస్తువులలో ముఖ్యమైనవి.



దంతపు సామాన్లు.

తొమ్మిదవ అధ్యాయము

# తివాసీలు

తివాసీలపరిశ్రమ మొగలుల కాలమున అత్యున్నత స్థాయిని అందుకున్నది. సర్ జార్జి బర్డ్వుడ్ వ్రాసినట్లు మొగలుచక్రవర్తియే గాక అనేకమంది సామంతులు, రాష్ట్రపాలకులు, జాగీరుదారులు తమరాజప్రాసాదములలో వివిధ చేతిపరిశ్రమలలో ప్రావీణ్యముగల కళాకారుల నుద్యోగించుచుండిరి. నిర్ణీతమైన వేతనము, దినబత్తెమును వీరు పొందుచు తమపనియందు ఏమాత్రము తొందర పెట్టబడక అమూల్యమైన కళాఖండము నెద్దానినైనను తయారు చేసినపుడు ప్రత్యేక పారితోషికములను గూడ పొందుచు నేర్పరితనము సంపాదించిన తమసంతతిలోనివారికి తమ వృత్తిని, ఉద్యోగమునుగూడ అందజేయుచుండిరి. వీరు ఒకప్రక్క తమజీవనము గడపుకొనుచు వేరొకప్రక్క కళామతల్లి సేవచేయుచుండిరి. మొగలుచక్రవర్తుల కాలమున

ఇట్లు తివాసీలనేత ఒకముఖ్యపరిశ్రమగా విలసిల్లె ననుట అతిశయోక్తి గాదు.

ఈనాడును రమ్యమైన రంగుల కలయిక, అందమైన పనితనముగల తివాసీలు, రగ్గులు సరసమైన ధరలకు దొరకుచున్నవి. శ్రీనగర్, అమృత్‌సర్, అలహాబాదు, ఆగ్రా, మీర్జాపూర్, జబ్బల్‌పూర్, జయపూర్, బందరు, ఏలూరు, ఒరంగల్లు, ఔరంగాబాదు, హైద్రాబాద్, నెల్లూరు, చెన్నపట్టణము, బెంగుళూరులు ఈపరిశ్రమకు మంచికేంద్రములు. కాశ్మీరు తివాసీల డిజైన్లు నేడు యూరపియన్ కళా ప్రాబల్యమునుగూడ చూపగల్గియుండుటగూడ గమనించదగిన విషయము. అనుశ్రుతముగ శ్రీనగర్ పరిశ్రమలలో కనబడు డిజైన్లు ప్రాచ్యకళా సంపదకు తార్కాణములు. అమృత్‌సర్, జయపూర్, అలహాబాద్‌ల తివాసీలను వస్తు నాణ్యతకు శ్రీనగర్ తివాసీల తరువాత చెప్పవచ్చును. మీర్జాపురము తివాసీల నేతకు మొదటినుండియు ఖ్యాతిలోనుండిన నగరము. 1867 సం॥ములో పారిస్ పారిశ్రామిక ప్రదర్శనమున అవి పాశ్చాత్యుల మన్ననల బడసి గిరాకీని పెంచుకొన్నవి. కాని ఇటీవల తివాసీలనేత ఇచ్చటి నేతగాండ్రుపయోగించుచుండిన ఉన్ని కొంత ముతకది యగుట వలన వీనిపేరు తగ్గుచున్నది.

ఈశతాబ్దముయొక్క తొలిరోజులందును పరిశ్రమలో రసాయనిక రంగులు గాక వనమూలికల రంగులనే వాడుచుండిరి. ఉదాహరణకు : దట్టమైన ఎరుపురంగు అవసరమైనచో బార్లీ పిండిని నీళ్లతో బాగుగ ఉడకబెట్టి లక్కను అందు కలుపుచుండిరి. ఉన్నిదారమునకు రంగు వేయుటకు కావలసిన పేస్టు ఇట్లు లభించును.

మచిలీపట్టణము లేక బందరునందు నాణ్యతకు గణింపదగిన తివాసీలను నేయించి తూర్పు ఇండియాకంపెనీ దొరలు తమఓడలలో బ్రిటన్‌కు, యూరప్‌కు తివాసీల నెగుమతి చేయుచుండిరి. ఇది 150 సం॥ముల పై మాట. రోజులు గడచినకొలది బందరు తివాసీలు తమ నాణ్యతను కోల్పోయినవి.

నేటి ఆంధ్రదేశమున ఏలూరు, వరంగల్లు, హైదరాబాదులు తివాసీలనేతకు ప్రాముఖ్యము నొందిన కేంద్రములు. వరంగల్లు, ఏలూరు రత్నకంబళులు ఎన్నదగిన పనితనము గలవి. ఈపరిశ్రమ ఆంధ్రరాష్ట్రమున కొక గర్వకారణమని చెప్పవచ్చును. ఈతివాసీలమీద వేయబడిన డిజైన్లు పర్షియన్, మొగలు సాంప్రదాయములకు చెందినవిగా కన్పట్టును. కాని వీనిలో స్థానికముగ లభించు ఉన్నికి

కావలసిన రంగులువేసి వివిధములగు డిజైనులలో ఇచ్చటి నేతగాండ్రు తివాసీలను నేయుచున్నారు. 1851 సం॥లో లండనపారిశ్రామికప్రదర్శనమునప్రదర్శింపబడిన వరంగల్ తివాసీముడుల సంఖ్యకు, దట్టమైననేతకు, నాజూకుపనితనము నకు ఆంగ్లేయుల నానందపరచినవి. దక్కన్ రగ్గులు అను పేరిట వివిధప్రదర్శనములలో ఇంగ్లండున 19 వ శతాబ్దపు రెండవభాగమున ప్రదర్శింపబడిన రత్నకంబళములు ఆంధ్ర దేశపు తివాసీల పరిశ్రమకు ఖండాంతరఖ్యాతిని తెచ్చినవి. నేడు ఈ రెండు పట్టణములలోను (వరంగల్, ఏలూరు) ఇవి లేఖాకృతి, పుష్పాకృతి డిజైన్లు రెండింటియందును విరివిగ నేయబడుచు సరసమైన ధరలకు లభించుటచే అన్ని తరగతుల ప్రజల ఆదరణను ఈపరిశ్రమ పొందగలుగు చున్నది. ఎగుమతియగు వస్తువులలో వీటికి మంచి గిరాకీ గలదు. ఏటా ఆంధ్రరాష్ట్రమునుండి ఎగుమతి చేయుటకు వీలగు సరకు మొత్తము విలువ 8 లక్షలరూపాయలు.

చెన్నపట్టణము ఇటీవలనే తివాసీలనేతకు పూను కొన్నది. అయినను డిజైన్లసౌందర్యము, రంగుల కలయిక పనితనపు నాణ్యత, ఉత్పత్తివిలువ బాగుగనే యున్నవి. మద్రాసురాష్ట్రములోని వెల్లూరునందును తివాసీలు నేయబడు చున్నవి. ఇచ్చటి వస్తువు నాణ్యత గిరాకీపై నాధారపడి

యున్నది. హైదరాలీ బెంగుళూరులో తివాసీల పరిశ్రమ ప్రవేశపెట్టెనని చెప్పుదురు.


తివాసీ పరిశ్రమ మొత్తముమీద యూరపియన్, అమెరికన్ మార్కెట్లపై ఆధారపడి యున్నది. కలకత్తా, మద్రాసు, బొంబాయిలలోగల ఎగుమతి వ్యాపార సంస్థలు నిర్ణయించిన గడువుకాలములో పనిముగించుటకు తహతహ లాడు నేతగాడు సౌందర్యమును ఆర్థికదుస్థితికి బలిపెట్టు చున్నాడనుట సత్యదూరము గాదు. ఏమైనను వివిధరాష్ట్రము లందలి ప్రభుత్వపారిశ్రామిక, వాణిజ్యశాఖలు జోక్యము కలిగించుకొని కళాకారులకు సహాయకరముగ ఆర్థికకార్య క్రమములను రూపొందించుచున్నవి.

రత్నకంబళములు పరచుటవలన గదుల కొక అందము చేకూరును. నేలపై రత్నకంబళములు పరచుట వలన గదికి కలుగు ప్రత్యేక వ్యక్తిత్వము, శోభ, ఇతర ఫర్నిచరు, చిత్రపటములు మున్నగు అలంకరణములు వేసి వలననైనను లభించదనుట అతిశయోక్తి గాదు.


పదవ అధ్యాయము

# చీరెలు, ఎంబ్రాయిడరీపని, లేసులు

అత్యుత్తమస్థాయికి చెందిన చేనేతబట్టలను గూర్చిన ప్రస్తావనలో భారతదేశమున మున్ముందుగ పేర్కొనవలసినవి మస్లినులు, కింఖబ్‌లు మరియు హిమ్రూ, మషూర్లు. ఢక్కా మస్లినులకథ చారిత్రాత్మకమైనది. ఢక్కామస్లినులను పచ్చికపై పరచినచో పచ్చికయేగాని వస్త్రముకాన్పింపకుండెడిది. 'సంధ్యాసమయపు మంచు' అని ఢక్కామస్లినులను జనులీకారణమున పిలుచుచుండిరి. మస్లినుల తయారీలో ఈనాడు ఖ్యాతిలోనున్న కేంద్రములు కాశీ, జయపూర్, మైసూరు, గ్వాలియర్, మధుర, తంజావూరులు. కింఖబ్ మానవుని వాస్తవికతనుండి స్వాప్నికజగత్తులోనికి లాగుకొనిపోవు గారడీగాని బట్ట కాదు. కాశీ, అహ్మదాబాదు, ఔరంగాబాద్, సూరత్, భోపాల్, ఢిల్లీ, లక్నో, తంజావూరు, తిరుచినాపల్లిలలో ఇది నేయబడుచున్నది. కాని



పోచంపల్లి చేనేత రుమాలు



నరసాపురం లేసు

కాశీ దీనికి ప్రధానకేంద్రము. హిమ్రూ ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణము. సాటీన్ పైనగాని, ట్విల్ పైనగాని కావింపబడిన ప్రత్యేకపు జవులు నేత చిత్రమైన, అందమైన డిజైనులతో కూడి హిమ్రూగా తయారగుచున్నది. కన్నులు మిరిమిట్లు గొల్పు ఎరుపురంగుపై చిత్రవిచిత్రములైన నమూనాలలోగల హిమ్రూబట్ట బ్లౌసులు, జాకిట్లు మున్నగు ఆకర్షణీయమగు స్త్రీలదుస్తులకు, తలుపులకు, కిటికీలకు వేయు తెరలకు, సోఫాలపై కవరింగుకు, అందమునకు అలంకరణప్రాయముగను అమరును. ఈమధ్య హిమ్రూ శాలువలు విశేషముగ జనాదరణ పొందుచున్నవి.

తరువాత చెప్పుకొనవలసినవి పట్టుబట్టలు. పట్టుబట్టలకు కాశీ, బరంపురము, కంచి మున్నగు పట్టణములకుగల ప్రాముఖ్యత అందరకు తెలిసినదే. ఆంధ్రప్రదేశ్‌లో సిద్ది పేట, సంగారెడ్డి, ఆర్మూర్, నారాయణపేట, పెద్దాపురం, ధర్మవరము పట్టుచీరెలకు ప్రసిద్ధికెక్కిన కేంద్రములు. ఈచీరెలలోగల పనితనము, నాణ్యము యాదృచ్ఛికముగ చూచినను దృష్టినాకర్షించును. ప్రకాశవంతమగు రంగులు, ఆకర్షణీయమైన జరీపనితనముగల ఈపట్టు చీరెలకు భారత దేశమంతటను గిరాకీ గలదు.

ఆంధ్రప్రదేశ్ చేనేతవస్త్రములలో ప్రత్యేకవిశిష్టత గల కొన్నింటి నీసందర్భమున పేర్కొనవచ్చును. ఉప్పాడ, గద్వాల్‌లు జరీచీరెలకు ప్రసిద్ధి. నూలుమీద జల్తారుపనిచేసిన ఈ జరీచీరెలు చాల అందముగను, ఆకర్షణీయముగను ఉండును. సరిగంచు పమిటకొంగులు, బార్డర్లుగల ఈఅంద మైన చీరెలకు మార్కెట్టులో మంచి గిరాకీ గలదు. ఈచీరె లపై తగినట్లు చోళీగుడ్డలుగూడ వచ్చుచున్నవి. ఇటీవల సంవత్సరములలో ప్రస్తుతపు అభిరుచుల కనుగుణ్యమైన డిజైనులలో ఉప్పాడచీరెలు విరివిగ వచ్చుచున్నవి. వెంకట గిరి, సిద్ధిపేటలుకూడ జరీచీరెలకు ప్రసిద్ధి కెక్కినవి. చౌక ధరలలో లభించుట వీని ప్రత్యేకత. చుక్కలు, గళ్ళు, పువ్వుల డిజైనులలో రమ్యముగ తయారగు ఈజరీచీరెల పనితనము చాల ఎన్నదగినది.

భారతదేశపు అద్దకపు బట్టలు విస్మరింపరానివి. అద్దకపుపని మనదేశమున అతిప్రాచీనమైనకళ. కలకత్తా, బందరు, కాకినాడ, సేలం, చెంగల్పట్టు, అమృత్‌సర్, కాశ్మీర్, లూధియానా, ఆల్వార్, కోథాల పనితనము చరిత్ర ప్రసిద్ధము. యూరపునుండి వర్తకమునకై భారతదేశము నకు బయలుదేరిన అన్ని తూర్పుయిండియా కంపెనీలు — డచ్చి, ఫ్రెంచి, ఇంగ్లీషు ఈస్టిండియా కంపెనీలు డబ్బు చేసి

కొనినది అద్దకపు కేలికోల వ్యాపారమునందే. కేలికో అద్దకమున అమృత్‌సర్ చీరెలకు, లక్నో శాలువలకు, కనోజ్ దుప్పట్లకు పేరు గలదు. ప్రథమ శ్రేణి కళాకారులకు జయపూర్, బందరు తప్పక చెప్పవలసిన కేంద్రములు. బందరు ఆంధ్రదేశములోనిది.

ఆంధ్రదేశపు అద్దకపుపనిని గూర్చి ప్రత్యేకించి ప్రస్తావించవలసిన అవసరము గలదు. ఈఅద్దకపుపనిలో భారతదేశమునందువలెనే ఆంధ్రదేశమునందును వేరు వేరు తీరులుగ సాంకేతిక పద్ధతు లవలంబింప బడుచున్నవి. వస్త్రములపైని డిజైనులు మాత్రము స్థానిక సంప్రదాయానుగుణముగ నుండెను. ఈ సాంకేతిక పద్ధతులను స్థూలముగ మూడు తరగతులుగ విభజింపనగును.

మొదటిది "రెసిస్టుస్టైల్ లేక ఇండిగో ప్రాసెస్". ఇదియే కలంకారీ అద్దకము. బందరు దీనికి ప్రసిద్ధి. స్థానికముగ లభించు కొన్ని మూలికలవలన రంగులు తయారుచేసి అద్దకముల కుపయోగించెదరు. కావలసిన డిజైనును రంగుతో కుంచె నొకదాని నుపయోగించి వేసెదరు. ఈ కుంచెనే 'కలం' అని పిలుతురు. డిజైనులో తెల్లగా నుండవలసినచోట మైనము పూయుటవలన రంగు పట్టక తెలుపే

మిగులును. రామాయణ, మహాభారతాది ఇతిహాసము లందలి కథలు చిత్రరూపమున వస్త్రములపై అద్దకముచేయ బడును. ఇప్పటికిని అనేక దేవాలయములలో కలంకారీ అద్దకపు వస్త్రముల ముక్కలు కానవగును.

ఇటీవల కలంకారీ అద్దకములో అందమైన చీరలే గాక దుప్పట్లు, తెరలు, మేజాబల్లలపై నుపయోగపడు గుడ్డలు వచ్చుచున్నవి.

మరియొక పద్ధతి "మోర్డెంట్ లేక డైడ్‌స్టైల్". ఈపద్ధతిని అలిజరైన్ పద్ధతి అని కూడ అందురు. దస్తర్‌ఖానాలు, గుడారముల కుపయోగించు గుడ్డల లైనింగులు, తెరల అద్దకము చేయుటకు ఈపద్ధతి నవలంబించెదరు. హైదరాబాదు ప్రాంతపు లంబాడీస్త్రీలు ఉపయోగించు దుప్పట్లు, దుస్తులుకూడ ఈపద్ధతి ననుసరించియే అద్దకము చేయబడుచున్నవి.

పైన చెప్పబడిన రెండుదేశీయపద్ధతులుగాక పోచంపల్లి, చీరాల అద్దకములలో ఇంకొకవిధానము అవలంబింపబడుచున్నది. వస్త్రము నేయుటకు కావలసిన పడుగు పేక నూలు ముందుగనే నిర్ణయింపబడిన డిజైనుప్రకారము రంగు వేసిన పిమ్మట వస్త్రము నేయబడును. సహజమై, కనుల

కింపై, అందముగ కన్పించు ఈకళాఖండములు పోచంపల్లి రుమాలులు, చీరెలు, చీరాల "ఆసియా" రుమాలులు, మిరి యాలగూడెం చేనేత చీరెలలో గలవు.

ఈఅద్దకములందు కన్పించు అనితర సాధ్యమైన వర్ణసమ్మిశ్రమమునుగూర్చి కొంత వివరణ అవసరము. ప్రకృతి ఒసంగిన సహజమైన, దట్టమైన రంగులు పూసు కొనిన అద్దకపు పరిశ్రమ సింధునుండి మలబారువరకు పడ మటి తీరమున వ్యాపించియున్నది. సింధు, కచ్చి ఎడారులు, కథియవారు, రాజపుత్రస్థానపు సరిహద్దులు, గుజరాతువరకు గల ప్రాంతమున ప్రకృతియందలి రంగులే సూర్య దేవుని వేడిమికి కరిగి ముద్దై, గాఢమై, అందముగ నేలపై, నింగిపై పులుమబడినవా యనిపించును. తదనుగుణముగ స్త్రీలును గాఢమైన రంగుల వలువలనే వాంఛింతురు. ఈ భూగోళప్రాంతమంతయు కన్నులు మిరిమిట్లు గొల్పు రంగు రంగుల అద్దకములకు పెట్టినది పేరు. ఉప్పునీటి కయ్యల మలబారులోనికి దక్షిణముగ పోయినచో పచ్చని, ఆకు పచ్చని వృక్షజాలపురంగు కొట్టవచ్చిన ట్లుండును. కన్యా కుమారినుండి ఉత్తరముగ తూర్పుతీరమున ప్రయాణిం చుచో కనబడు రంగుల కలయిక వేరు. ఇచ్చటి కళాకారుడు కంజీవరము, తంజావూరు, కొచ్చిన్, పద్మనాభపురము

దేవళములగల చిత్తరువులచే ఉత్తేజితుడై బందరు, పాలకొల్లు, కాళహస్తి, నాగపట్టణం, సేలం, మధురై, తంజావూరు పట్టణములలో కలంకారీ అద్దకమును సాగించెను.

హిందూ పురాణేతిహాసముల కథల చిత్రణము, భారతీయ సంస్కృతిని ప్రతిబింబించు హంస, గజము, అశ్వము మున్నగువాని రూపములు, బౌద్ధసంప్రదాయము, బుద్ధభగవానుడు, హిందూదేవతలు, మొగలు సంస్కృతి ప్రాబల్యచిహ్నముగ సూచ్యాకృతిలతాదులు కాక అద్దకపు పరిశ్రమలో కనబడు ఒకానొక విశిష్టమైన డిజైను "జీవిత వృక్షము".

చీరెల ప్రస్తావనతో ఆరంభమైన ఈఅధ్యాయము అల్లికలేసుల నాజూకు పనితనపు వర్ణనతో ముగించుట యుక్తము.

ఆంధ్రప్రదేశ్‌లో పశ్చిమ గోదావరి జిల్లాయందు గల అల్లిక లేసుల పరిశ్రమ ఖండాంతరగిరాకీ గలది. దీనికి నర్సాపురము కేంద్రము. ఐదువేలకు పైగా స్త్రీలకు జీవనోపాధి నిచ్చు ఈపరిశ్రమకు కావలసినవి డైమండ్ దారము, అల్లికసూది. వివిధాకృతులలో, అనేక సైజులలో కప్పులపై పరచుటకు తగినంత ఆకారముమాత్రమే గల

చిన్న చిన్న లేసులనుండి, తలుపులకు తెరలు, పందిరి మంచముపై పరచుటకు కావలసినంత లేసు కవరింగుల వరకు అనేక అందమైన డిజైనులలో లేసులు తయారగుచున్నవి. ఏటా 15-18 లక్షలరూపాయలవరకు వ్యాపారము ఇతరదేశములతో జరుగుచున్నది.

పదకొండవ అధ్యాయము

## చేతిపరిశ్రమలు - కొన్ని ఆర్థికసమస్యలు

పారిశ్రామిక కళల లేక కళాసమన్వితమైన చేతి పనుల ప్రత్యేకత వాటిసౌందర్యమని వేరుగ చెప్పనక్కర లేదు. ఇంతేగాక ప్రతియొక్క పారిశ్రామిక కళకు ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వము, ప్రాంతీయవిశిష్టత కలవు. ఉదాహరణకు రాజస్థానమునందును, ఆంధ్రప్రదేశ్‌లోను అద్దకపు పరిశ్రమ ఒకేవిధముగ లేదు. మన ఆర్థికవ్యవస్థలో పారిశ్రామిక కళలకుగల స్థానమును సూచించుటకు సాలీనా నూరుకోట్ల రూపాయలకు తక్కువకాని విలువగల వస్తువులను మనము ఉత్పత్తిచేయుచున్నామని తెలిపిన చాలును. ఉద్యోగావకాశములను విస్తరింపజేయుటకు పారిశ్రామికకళలు యెంతయో సహాయ పడగలవని నేడు అర్థశాస్త్రవేత్తలు అంగీకరించుచున్నారు. అయితే వీని నెదుర్కొనుచున్న ఆర్థికసమస్యలు కొన్ని లేకపోలేదు.

పెట్టుబడిసమస్య మొదటిది. ప్రభుత్వము మంజూరు చేయు గ్రాంటులు, ఋణముల సహాయముతో పారిశ్రామిక

సహకారసంఘములు స్థాపించి ఈసమస్యను పరిష్కరింప నగును. బిద్రీపరికరములు, వెండినగిషీపని, తివాసీలు మున్నగు కళాసమన్వితమైన చేతిపరిశ్రమలు పడిపోవు స్థితిలో నున్నపుడు వాటిని నిలబెట్టుటకుగాను పారిశ్రామిక సహకారసంఘములద్వారా మాజీ హైదరాబాదు ప్రభుత్వ మొనరించిన కృషి పారిశ్రామిక సహకార సంఘములకు పెట్టుబడి సమస్యను పరిష్కరించుటలో గల సామర్థ్యము నకు తార్కాణము. చేతిపరిశ్రమలను విపణికి తీసికొని వచ్చుటను పరిశీలించిన నివేదిక ఈరంగమున సహకారము, పూర్తిప్రాబల్యము వహింపవలెనని పేర్కొనెను. ఉత్పత్తి, మార్కెటింగు పరస్పర సంబంధముగల అంశములు. విపణిలో గిరాకీగల వస్తువులు తగినంతగ ఉత్పత్తి చేయుట యందును, నాణ్యత చేయుటయందునుగూడ పరిశ్రమ తప్పు చేయుచున్నదని పరిశీలనలవలన తెలియుచున్నది. అంత ర్జాతీయ కార్మికవ్యవస్థ, పారిశ్రామిక సహకారసంఘములే కళాసమన్వితమైన చేతిపనులకు సరియైన ధర, నిలకడయైన మార్కెట్టు తేగల సంఘములని వివరించెను.

చేతిపరిశ్రమల ఉత్పత్తివిలువలో నూటికి 97 వంతుల వరకు ప్రయివేటు వ్యాపారుల చేతులలోనే యున్నది. సహకార పారిశ్రామిక సంఘములద్వారా నూటికి రెండు

వంతుల వ్యాపారముమాత్రమే జరుగుచున్నది. ప్రభుత్వ వ్యాపార సంస్థలచేతులలో ఒకవంతుకు మించి లేదు. పైన పేర్కొనిన మార్కెటింగు సంస్థల యోగ్యతాయోగ్యతలను గూర్చి భేదాభిప్రాయములున్నను సక్రమమైన మార్కెటింగు సదుపాయములు లేనంతవరకు పరిశ్రమ పురోగమింపజాల దని చెప్పవచ్చును.

సరియైనధర, నిలకడయైన మార్కెట్టు లభించవలె నన్న మూడువిధములగు చర్యలను తీసికొనుట అవసరము. 1. వస్తువుల నాణ్యతను పెంపొందించుట. 2. వస్తూత్పత్తి కగు ఖర్చు తగ్గించుట. 3. ప్రకటన సౌకర్యములు అభివృద్ధి పరచుట.

కళాసమన్వితమైన చేతిపరిశ్రమలు మారుచున్న ఈరోజులలో ప్రజాభిరుచుల కనుగుణముగ వస్తూత్పత్తిని మార్చుకొనగలిగియుండవలెను. కేవలము సౌందర్యోపాసన, కళారాధన పరమావధులుగ మడికట్టుకొని కూర్చున్న, విపరీతమైన ఖరీదులు కలిగి, జాగీరుదారుల రోజులలోవలె ప్రభువర్గమువారే కొనగలిగిన వస్తువులుమాత్రము తయారు చేయుచుండిన ఆపరిశ్రమ ఎట్లు బ్రతకగలదు? హైదరాబాదు బిద్రీపరికరముల పరిశ్రమ కళాఖండములతోపాటు

నిత్యజీవనమున కుపకరించు గుండీలు, అష్ట్రేలు వంటి వస్తువులుగూడ తయారుచేసి తనమనుగడకు తానే ప్రణాళిక వేసుకొనగలిగినది. బహమనీసుల్తానులనాటి పరిశ్రమ 20వ శతాబ్దమున కనుగుణముగ మారినది. కళనా విస్మరించలేదు. నిర్మల్ పరిశ్రమకూడ ఇట్లే తన భవిష్యత్తుకు రూపుదిద్దుకొన్నది.

ప్రభుత్వమువారి ప్రదర్శనశాలలు, అమ్మకపుడిపోలు పారిశ్రామిక ప్రదర్శనములు, విదేశాంగ కార్యాలయముల ద్వారా ప్రచారము చేతిపరిశ్రమల అభివృద్ధి కెంతో దోహదము కలుగజేయగలవు.

1949 లో న్యూఢిల్లీయందు గ్రామీణ పరిశ్రమల ప్రదర్శనాలయము స్థాపింపబడినది. ప్రదర్శనశాలలు, అమ్మకపు డిపోలు ఇంచుమించు అన్ని రాష్ట్రములందును గలవు. అంతర్జాతీయ పారిశ్రామిక ప్రదర్శనములలో మన కళాఖండములు ప్రదర్శింపబడుచున్నవి.

అన్నిటికిమించి అఖిలభారత చేతిపనులబోర్డు చేయుచున్నకృషి చాల ముఖ్యమైనది. ఇది 1952 లో స్థాపింపబడినది. దీనికి అధ్యక్షులు శ్రీమతి కమలాదేవి చట్టోపాధ్యాయగారు. నాణ్యతను చక్కదిద్దుటకుగాను వివిధచేతిపరి

శ్రమలలో కార్యక్రమము రూపించబడినది. సాంప్రదాయిక డిజైనులను పెంపొందించుటకు, నేటికాలపు అభిరుచులకు అనుగుణముగ వాటిని మార్చుటకు డిజైను సెంటర్లు స్థాపింప బడుచున్నవి, పరిశోధన కొనసాగుచున్నది. ఉత్పత్తి నధికము చేయుటకు, యంత్రసహాయము పొందుటకు వీలైన చోట్ల అట్టిప్రయత్నముకూడ జరుగుచున్నది.

ఈ పరిశ్రమలను సహకార రంగము క్రిందికి తెచ్చుటకు, పారిశ్రామికులకు బహుళముగ సదుపాయములు లభింపజేయుటకు విక్రయకేంద్రములు నెలకొల్పియు, ఎగుమతిని ప్రోత్సహించియు, తయారైన సరకు విడుదలయగుటకు తగిన అవకాశములు కలిగించుటకు ఈసంస్థ విశేషముగ కృషి సల్పుచున్నది. చేతిపారిశ్రామికులు ఈసంస్థ కల్పించిన సదుపాయములను చక్కగా వినియోగించుకొని తమపరిస్థితిని మెరుగు కల్గించుకొందురు. అంతేగాదు, మనసంస్కృతికి ప్రతిబింబములైన చేతిపనులు నిత్యకళ్యాణము-పచ్చతోరణముగ వర్ధిల్లుటకు తోడ్పడిన వారగుదురు.

□

పన్నెండవ అధ్యాయము

# అఖిలభారత చేతిపరిశ్రమల బోర్డువారు చేతిపరిశ్రమల అభివృద్ధికొరకు చేయుచున్న కృషి

ఇంతకుముందు అధ్యాయములో చేతిపరిశ్రమకు సంబంధించిన వివిధ విషయములను గూర్చి పరిశీలించి యున్నాము. ఈచేతిపరిశ్రమాభివృద్ధికై విశేషకృషి చేయుచున్న ప్రధానసంస్థనుగూర్చి తెలుపుట అవసరము. అదియే అఖిలభారత చేతిపరిశ్రమల బోర్డు.

రాజ్యాంగ చట్టము ప్రకారము చిన్న పరిశ్రమలు రాష్ట్రప్రభుత్వముల కార్యరంగములోనివి. అయినప్పటికినీ పెక్కు కారణములవలన కేంద్రప్రభుత్వముగూడ వీటికొరకు ప్రత్యేకశ్రద్ధ వహించుచున్నది. భారీపరిశ్రమలతోపాటు పారిశ్రామిక వికేంద్రీకరణమును గూడ ప్రోత్సహించి

చిన్నతరహా పరిశ్రమలకుగూడ దోహదము చేయవలెనను ఆశయము ఇందులకు మొదటి కారణము. అందువలననే మన పంచవర్ష ప్రణాళికలలో వీటికి సముచితస్థాన మివ్వబడినది. వీటిద్వారా దేశములో నిరుద్యోగమును నిర్మూలించి ప్రజలకు ఉపాధిమార్గము కల్గించవలెనను ఆకాంక్ష ద్వితీయకారణము. ఇది విదేశమారకము సంపాదించుటలో ఉపయోగకరమగుట తృతీయకారణము.

చేతిపరిశ్రమల అభివృద్ధికి ఒక ప్రత్యేకసంస్థ యుండవలసిన ఆవశ్యకతను గుర్తించి, 1952 సం॥న అఖిల భారత చేతిపరిశ్రమల బోర్డు అనుసంస్థను నెలకొల్పి యున్నారు. 1957 సం॥లో ఈసంస్థయొక్క కర్తవ్యములు విస్తరింపబడినవి. మొదటి పంచవర్ష ప్రణాళికలో కొద్దిపాటిగ ప్రారంభింపబడిన కార్యక్రమములు ద్వితీయ ప్రణాళికలో పెంపొందింప బడినవి. ఈసంస్థయొక్క కార్యక్రమములు, చేతిపరిశ్రమలకై రాష్ట్రప్రభుత్వముల కృషి చక్కగ పరస్పరము సమన్వయపరచుకొనబడుచున్నవి.

ఈసంస్థయొక్క ప్రధానాశయములు ఈ క్రింద పేర్కొనబడినవి. 1. చేతిపరిశ్రమలకు సంబంధించిన సాంకేతిక, ఆర్థిక, నిర్వహణ, కళావిషయములు మొదలగు

వాటిని పరిశీలించి వాటిఅభివృద్ధికి ప్రణాళికలను రూపొందించుట. 2. చేతిపరిశ్రమల అభివృద్ధికై ప్రణాళికలు తయారుజేసి అమలు జరుపుటలో రాష్ట్రప్రభుత్వములకు సహాయము చేయుట. వివిధరాష్ట్ర ప్రభుత్వముల కృషిలో సమన్వయము సాధించుట. 3. కేంద్రప్రభుత్వ సహాయమునకై రాష్ట్రప్రభుత్వములు, ఇతర సంస్థలు పంపు ప్రతిపాదనలను పరిశీలించి కేంద్రప్రభుత్వమునకు సిఫార్సు చేయుట. 4. కేంద్రప్రభుత్వమే నేరుగ నిర్వహింపవలసిన పథకములను రూపొందించి వాటిని అమలు జరుపుట. 5. భారతదేశములోను, విదేశములలోను వీటివిక్రయమునకై చర్యలు తీసికొనుట. 6. నమూనాల (Designs) పెంపొందించుట, నాణ్యత విషయములో కట్టుబాటు, పరిశోధన శిక్షణ, ప్రచారము, ఎగుమతులు, పారిశ్రామికులకు పరపతి సౌకర్యములు, ముడిసరకుల సరఫరా మొదలగు విషయములలో వలసిన చర్యలు గైకొనుట.

పై లక్ష్యములు సాధించుటలో ఈసంస్థ విశేషకృషి చేసినది. ఈసంస్థ చేసిన కృషిని రెండుభాగములుగ విభజించవచ్చును. ఉత్పత్తి రంగములలో చేసినకృషి, విక్రయావకాశములను పెంపొందించుటకై తీసికొనిన చర్యలు అనునవి ఈభాగములు.

వివిధ ప్రదేశములలో ఈపరిశ్రమల స్థితిగతులను తెలిసికొనుటకు ఈసంస్థ అధ్యక్షులు, అధికారులు పర్యటించు చున్నారు. ప్రణాళికా, పరిశోధనా విభాగములవారును, నమూనాల కేంద్రములవారునుగూడ పరిశీలన జరుపు చున్నారు. అంతే గాక విదేశనిపుణులనుకూడ చేతిపరిశ్రమల కేంద్రములకు మధ్యమధ్య రప్పించి చేతిపరిశ్రమల అభివృద్ధికై వారినుండి సూచనలు స్వీకరింపబడుచున్నవి.

చేతిపరిశ్రమల పునరుద్ధరణకు, వాటి యుత్పత్తిలో క్రొత్తపద్ధతులు ప్రవేశపెట్టుటకు మార్గదర్శక కేంద్రములు నెలకొల్పుచున్నారు. పారిశ్రామికులకు శిక్షణాతరగతుల నేర్పఱచియు, శిక్షణా సంస్థలను నిర్వహించువారికి ఆర్థిక సహాయము జేసియు, నమూనాలను సూచించు కేంద్రములను ఏర్పఱచియు, ఉత్పత్తియైన వస్తువులు నవీనఅభిరుచులకు సరిపడునట్లు తోడ్పడుచున్నారు.

తయారైన వస్తువులకు సరియగు గిరాకీ లేనియెడల ఉత్పత్తిని పెంపొందించుటలోగల లక్ష్యము నెఱవేరదు. అందువలన విక్రయావకాశములు పెంపొందించుటకై ప్రధాన పట్టణములు, నగరములలో విక్రయశాలలు నెలకొల్పి యున్నారు. కేంద్రరాష్ట్రప్రభుత్వములు వీటిని నెలకొల్పి

టకు బోర్డువారు ధనసహాయము చేయుచున్నారు. విమానాశ్రయములు, రైల్వేస్టేషనులు మొదలగుచోట్ల ప్రదర్శపేటికలు (Show cases) ఏర్పాటు చేయబడుచున్నవి. ఈ బోర్డువారు కేంద్రవిక్రయ విషయముల కమిటీనికూడ నెలకొల్పియున్నారు. ప్రధానరాష్ట్ర విక్రయశాలలయొక్క సహకార విక్రయసంస్థలయొక్క ప్రతినిధులు ఇందులో సభ్యులు. అఖిలభారత చేతిపరిశ్రమల వారములనిర్వహణకై ధనసహాయము చేయుచున్నారు. ఎగుమతులను పెంపొందించుటకు, నాణ్యతవిషయమైగూడ తగిన కట్టుబాట్లు చేయబడుచున్నవి. ఎగుమతి, దిగుమతిదార్లకు వాటినిగూర్చిన సమాచారములు అందజేయబడుచున్నవి.

అంతే గాక ఈపారిశ్రామికులు సహకార వ్యవస్థ క్రింద వ్యవహరించుట ఈబోర్డువారి ఆశయము. ఇందు నిమిత్తమై కేంద్రసహకార సంఘమను సంస్థ గలదు. ఇది మూడు మాసముల కొకతూరి సమావేశమై చేతిపరిశ్రమల సహకారసంఘముల సమస్యలు చర్చించుచున్నది. ఇది ఈ సంస్థలనుగూర్చి గోష్ఠులనుకూడ నిర్వహించుచున్నది. ఈ సహకార సంఘములకు వాటా ధనము, నిర్వహణధనము మొదలగు వాటికై వాయిదాలపై తీర్చుపద్ధతిన ఋణములను ఇచ్చుచున్నది.

ఇట్లు ఈసంస్థ చేతిపరిశ్రమల పునరుద్ధరణకు చక్కటి కృషి చేయుచున్నది. ఇదిగాకయే ఇతరపథకముల క్రింద ప్రయోజనముపొందు అవకాశములేని పారిశ్రామికుల పారిశ్రామిక యూనిట్లకొరకు రాష్ట్రప్రభుత్వములు అధిక మొత్తములు కేటాయించినవి. ఈపరిశ్రమలకు ప్రభుత్వ ధనసహాయచట్టముక్రింద ఈమొత్తము వారికి అందజేయ బడును. ఇట్లు చేతిపరిశ్రమల అభివృద్ధికి, పారిశ్రామికుల శ్రమఫలితములు ఇతరులపాలు గాకుండుటకు రాష్ట్రప్రభుత్వ ములు, బోర్డువారు తీవ్రకృషి సల్పుచున్నారు.

# ఉ ప సం హా ర ము

ఇంతకుముందు అధ్యాయములలో వివిధ చేతిపరిశ్రమల ప్రస్తుతస్థితిగతులను సమీక్షించియున్నాము.

మన ఆర్థికవ్యవస్థలో వీనికిగల స్థాన మెట్టిదో చర్చించియున్నాము.

సంస్కృతీపరంగా వీనికిగల ప్రాముఖ్యమును గమనించియున్నాము.

భారతీయ నాగరకత వీటిలో ప్రతిబింబించినది.

భారతీయ సంస్కృతి వీనిలో ప్రతిఫలించినది.

అందచందాలు పుణికి పుచ్చుకొన్న రసగుళిక లివి. సౌందర్యం వీని సొమ్ము. అందచందాలుగల వస్తువులు ఆనందప్రదము లని కీట్సు మహాకవి సూక్తి.

చేతిపరిశ్రమల నభిమానించుట మనలోని సౌందర్య పిపాసకు తార్కాణము కాగలదు. మనలోని ఉత్తమ అభిరుచులకు నిదర్శనము కాగలదు. మనయొక్క సంస్కృతీ

స్థాయికి దృష్టాంతము కాగలదు. కేవలము సాంస్కృతిక ప్రాముఖ్యమునుబట్టి కళాసంబంధమైన కారణాలవలన మాత్రమేగాని వీటిని అభిమానించవలెననుకొనుట సాహసమే కాగలదు.

మన తోడిసోదరు లనేకమంది గ్రామాదులలో వంశపారంపర్యముగ కొన్ని చేతిపరిశ్రమలను నిర్వహిస్తున్నారు. అదే వారిఉద్యోగం. అదే వారివృత్తి. అదే వారిఉపాధి మార్గం. వారికి నాలుగువ్రేళ్ళు లోపలకు పోవుటకు ఒక వైపు ఉత్పత్తిసౌకర్యములు, మరొకవైపు విక్రయావకాశము లవసరము. అవి లేనిచో పరిశ్రమలు క్షీణించక తప్పదు.

ఉత్పత్తి సౌకర్యములను ప్రభుత్వములు, చేతిపరిశ్రమల బోర్డువారు సమకూర్చుచున్నారు. విక్రయావకాశములను కల్పించుచున్నారు. ప్రచారమార్గా లన్వేషించుచున్నారు.

కాని ఉత్పత్తిఅయిన వస్తువును ఖరీదుచేసి, వాటిని ప్రోత్సహించవలసిన బాధ్యత మనది. గిరాకీ లేకపోతే ఉత్పత్తి ఎంత పెరిగినా అది 'అడవిగాచిన వెన్నెల', 'బూడిదలో పోసిన పన్నీరు'.

విక్రయము ప్రోత్సాహకరంగా లేనియెడల ఉత్పత్తి క్షీణించక తప్పదు. ఉత్పత్తి క్షీణించినంతనే అందలి పనివారల ఉపాధిమార్గములు సన్నగిల్లును. ఇదే చేతిపరిశ్రమల పతనమునకు దారి తీయగలదు.

విదేశములలో వీటికి విక్రయావకాశములను పెంపొందింపవలసినదే. అయితే విదేశములవారి ఆదరణనే పూర్తిగ నమ్ముకొనిన ఏపరిశ్రమయైనను అభివృద్ధి నొందజాలదు. కాబట్టి స్థానికముగ గిరాకీ పెంపొందవలెను. ఇందుకు పూర్తిగ మన సహకార మవసరము. మన ఆదరణ ముఖ్యము. మన మిచ్చు ప్రోత్సాహమే వీటిపాలిటి ప్రాణవాయువు.

కాబట్టి ఈరచయితచేసే విజ్ఞప్తి ఒక్కటే. సౌందర్య నిలయాలయిన ఈవస్తువులను ప్రోత్సహించుట మనకర్తవ్యము. అందువలన సౌందర్యమును అర్చించినవార మగుదుము. భారతీయసంస్కృతిని ఆరాధించినవార మగుదుము. అంతే గాదు. అనేకమంది తోడిమానవులను నిరుద్యోగము నుండి కాదు, ఆకలిబాధనుండి కాపాడినవార మగుదుము.

అ ను బం ధ ము

# ఆంధ్రప్రదేశ చేతిపరిశ్రమలు

అనాదినుండి భారతదేశం చేతిపరిశ్రమలకు ప్రసిద్ధి. మన కళలు దేశదేశాలలో వాసి కెక్కాయి అని యిప్పటి వరకు తెలిసికొన్నాం. ఢాకా మస్లిన్ల పనితనం, అన్ని దేశాల వారిని ఆకర్షించింది. చేతిపనులకు రాజపోషణకూడ వుండేది. రోజులు మారాయి. విదేశప్రభుత్వము ఆదరించక పోవుటచే వాటి బ్రతుకు బజారున పడింది. మరియును యంత్ర యుగంలో కళానైపుణ్యానికి అంతతావు లేదు. స్వాతంత్ర్యం వచ్చినతరువాత, మనప్రభుత్వం వీటియందు శ్రద్ధ చూపింది. ఇతర దేశాలలో కూడ మనచేతి సరకులకు చాల గిరాకీ వుంది. వీటివలన విదేశ మారకద్రవ్యం లభించుటయేగాక, దేశాభివృద్ధికికూడ దోహదం కలుగుతుంది. మనచేతి పరిశ్రమలలో అందం, చందం కూడ వుంది. కొంతమంది యంత్రయుగంలో, చౌకగా దొరికే వస్తువులు కొనుక్కొని

హాయిగా వాడుకోకూడదా ? అంటారు. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలంటే, మానవజీవితానికీ, కళకూ వుండే సంబంధం తెలియాలి. కళలు ఆనందంకొరకే. వాటిస్పర్శ వలననే హృదయం ఉప్పొంగుతుంది. మనమనస్సు వికసిస్తుంది. ఏయింట్లోఅయినా చేతివస్తువులు వున్ననాడే యింటికి హంగు. చూడవచ్చిన వారికి ఆనందం. మన చేతిపరిశ్రమలు గ్రామీణజీవితంలోను, భారతసంస్కృతిలోను ఒక భాగం. గ్రామీణకళాకారులు విద్యావంతులు కాక పోయినా, వారు ఎంత సంస్కారవంతులో వారికళలు, చేతి పరిశ్రమలు చెప్పగలవు. ఇవి మనం దాచిపెట్టుకొన్న ఆస్తి. వీటిని పోషించి మన నాగరికత, సంస్కృతులను ఇతరులకు చెప్పవలసిన బాధ్యత మనపై గలదు.

చేతిపరిశ్రమల రంగంలో, భారతదేశం అగ్రగణ్యత వహించింది. భారతదేశంలో ఆంధ్రప్రదేశం ప్రధానస్థానం పొందింది. మనరాష్ట్రములో వున్నన్ని వివిధరకముల చేతి పరిశ్రమలుకాని, నిర్మాణచాతుర్యముగాని, ఏయితరరాష్ట్రము లోను లేవు. వీటిలో మనసంస్కృతీ, సాంప్రదాయాలు ఇతరరాష్ట్రాలకే కాక, విదేశములకుకూడ పోయినవి. ప్లాస్టరు బొమ్మలు ఎక్కడైనా కొనవచ్చు. కాని సహజ సౌందర్యం వెదజల్లే వస్తువులంటే అందరికి యిష్టమే. మన రాష్ట్రంలో

తయారయి వివిధరకముల రంగులతో, యింపైన డిజైనులతోవుండే చీరెలన్నా, లక్కబొమ్మలన్నా, చాపలన్నా రత్నకంబళ్ళన్నా, ప్రతివారిదృష్టిని ఆకర్షిస్తున్నాయి. అమెరికాలో ఇప్పుడు మన పోచంపల్లిచీరలు అచ్చటిస్త్రీలు ధరిస్తారంటే ఏఆంధ్రుడు సంతోషించడు ?


అంతేకాకుండా, మాజీహైదరాబాదు సంస్థానంలో చేతిపనులకు ముఖ్యస్థానం యిచ్చిరి. నిర్మలు పని, వరంగల్ రత్నకంబళ్ళు, బద్రి, హిమ్రు, ఫంగ్రీ, మొదలగు చేతి పనులకు నవాబులు, సామంతులు ఎంతో ప్రోత్సాహమిచ్చారు. అందుచేతనే, యీనాటికికూడ తెలంగాణా ప్రాంతము, చేతి పరికరములకు అగ్రస్థానము వహించినది చెప్పాలి. ఇది ఆంధ్రులకు గర్వకారణము. నిర్మలులో కర్రతో చేసిన సింహమును చూచి నిజమైన సింహమాఅని అనుకొనెదరు.

బొమ్మలు :—

తింటే గారెలే తినాలి, చూస్తే బొమ్మలే చూడాలి. మానసికశాస్త్రముప్రకారము పిల్లలకు బొమ్మలవలన ఎంతో విజ్ఞానం రాగలదు. అవి పిల్లల స్నేహితులని చెప్పాలి. బొమ్మలంటే నిర్మలు వెళ్ళాలి. తిరుపతి, తిరుచానూరు సందర్శించాలి. ఏటికొప్పాక, కొండపల్లి పనికట్టుకుని



నవీన నిర్మల్ కళ



కొండపల్లి బొమ్మలు

చూడాలి. మన రాష్ట్రంలో నలుదిశలా బొమ్మలు తయారవుతున్నాయి.

అనాదినుండి కొయ్యబొమ్మల పరిశ్రమలో మన రాష్ట్రం వన్నెకాంచినది. వీటికి కావలసిన ముడిపదార్ధం కఱ్ఱ. ఇది సులభముగా అచ్చటవున్న అడవులలో లభ్యమవుతోంది. వీటిలో మతసంప్రదాయాలు, పౌరాణికగాధలు చిత్రింపబడుచున్నవి. నిర్మలు బొమ్మలు బూరుగు, పునుగు కఱ్ఱతో తయారుచేస్తారు. మనుష్యులు, పశువులు, పువ్వులు, ఫలాలు, రైలుయింజన్లు, పక్షులు, జంతువులు, పళ్ళాలు అతి సొగసుగా తయారుచేస్తారు. చింతజిగురుతో, వివిధభాగాలు అంటిస్తారు. అక్కడ లభ్యమయే రంగులు కొన్ని బంగారంవలె వుంటాయి. ఈపద్ధతి ఉపయోగించి హైదరాబాదులో కొత్త నిర్మలు వస్తువులు, అనగా సిగరెట్టుకేసులు, లాంతరుస్తంభాలు, సోఫాలు, వివిధరకముల బొమ్మలు తయారుచేస్తున్నారు. నిర్మల్ పనివారలు వనమూలికలసహాయంతో బంగారంలాగ వుండే రంగు తేగలరు. ఆదిలాబాదు అడవులలో నెమళ్ళు, పెద్దపులులు విశేషంగా వుంటాయి. వీటినికూడ అచ్చుపోసినట్లు తయారుచేస్తారు.

(5)

కొండపల్లి బొమ్మలు :—

కొండపల్లి బొమ్మలు మన గ్రామీణజీవితానికి ప్రతి బింబాలు. రైతుల బొమ్మలు, పోలీసులు (నైజాం పోలీసులతోసహా), దశావతారాలు, గొబ్బి మొదలైన ఎన్నో రకాల బొమ్మలు, ఇచ్చట తేలికయిన కర్రతో తయారవుతున్నాయి. వాటిని చూస్తే "భారతప్రజల జీవితచరిత్ర చదివినట్లే" అని చెప్పాలి.

కొన్నిశతాబ్దములక్రితం ఆర్యక్షత్రియులు రాజస్తాను నుండి యిచ్చటకు వచ్చారు. దగ్గరనున్న అడవులనుండి పొనుగుకర్రతో ఈబొమ్మలు చేస్తారు. ఈబొమ్మలు చూస్తే, మౌనభాషతో మనతో మాట్లాడుచున్నట్లుంటుంది.

ప్రభుత్వమువారు శిక్షణసౌకర్యాలు ప్రవేశపెట్టే సహకారసంఘానికి గ్రాంటులు, అప్పులు ఇచ్చి ఈపరిశ్రమకు దోహద మిచ్చారు. పనివారలు ఒకేచోట పనిచేయుటకు వసతిసౌకర్యము, యంత్రసహాయము, ధనసహాయము కలుగచేశారు. సాలీనా 60, 70 వేల రూపాయల విలువగల బొమ్మలు తయారయి యితర ప్రాంతములకు, పదేశాలకు పోతున్నాయి వీటిగిరాకీ నానాటికి హెచ్చుతోంది. మద్రాసు

లోని Victorial Technical Institute వీటికి మార్కెట్లు లభించుటలో ఎంతో సహాయము చేసింది.

ఏటికొప్పాక లక్కబొమ్మలు :—

లక్క రంగుబొమ్మలు ఏటికొప్పాకలో విరివిగా తయారవుతున్నాయి. ఎద్దులు, రైలుయింజన్లు, గ్రామఫోనులు, పండ్లు మొదలైన సరకులు, స్థానికముగా లభ్యమయే కట్టెతో తయారు జేస్తారు. వీటికికూడ మంచి గిరాకీ వుంది.

ఇతర కేంద్రాలు :—

తిరుపతిలోను, తిరుచానూరులోను ఎర్రచందనపు కట్టెతో మానసిక ప్రతిమలు, దేవతలు. పురాణపాత్రలు, తయారు చేస్తారు. ఈ బొమ్మలరంగు మారదు, అలాగే వుంటుంది. తిరుపతి పోయిన ప్రతియాత్రికుడు ఈబొమ్మలు కొంటాడు. చిన్నపిల్లలు ఈబొమ్మలకు దుస్తులు తొడిగి ఆడుకొంటారు.

బందరులో కాగితపుముద్దతో రంగురంగుల బొమ్మలు తయారు చేస్తారు. వాటిలో స్ప్రింగ్ పెట్టి,

ఆబొమ్మలచేత నృత్యముకూడ చేయిస్తారు. వీటినే డ్యాన్సింగ్ డాల్స్ అంటారు.

మనరాష్ట్రంలోని వివిధబొమ్మలకు ప్రత్యేకవిశిష్టత వుంది. పిల్లల మనోవికాసానికి బొమ్మలు ఎంతో అవసరం. చంటిపిల్లలకు విద్యాబోధనలోకూడ బొమ్మలు సాధనాలు. ఏతీర్థానికి పోయినా మనం ముఖ్యంగా పిల్లల బొమ్మలు కొనవలసిందేగదా. దసరా బొమ్మల కొలువులో గూడ, ఈబొమ్మలు తప్పకుండా పెడతాం.

ఆంధ్రప్రదేశ ప్రభుత్వంకూడ ఈ పరిశ్రమకు దోహద మిచ్చింది. ఉత్పత్తికి, అమ్మకానికి, తగుసౌకర్యాలు కలిగించింది.

మనతివాసీలు :—

మనరాష్ట్రంలో ఉన్ని విరివిగా లభ్యమవుతుంది. 14, 15 శతాబ్దములలో పారశీకదేశమునుండి పనివారలు ఇక్కడకు వచ్చి స్థానికంగా లభ్యమయే ఊలుతో ఇక్కడే తివాసీలు చేయటం మొదలుపెట్టారు. ఈ ప్రాంతము ఆ రోజులలో మహమ్మదీయ రాజుల పరిపాలనలో నుండేది. వారు ఈ పరిశ్రమలకే గొప్ప దోహదము యిచ్చారు. ఆ రోజులలో మేలైన తివాసీలు ఇక్కడే తయారయేవి.


సాలీనా ఏలూరులో రెండులక్షల రూపాయిల విలువగల తివాసీలు తయారవుతాయి. నేత చాల బాగుంటుంది. డిజైనులు అతిరమ్యంగా వుంటాయి. వీటికే విదేశాలలోకూడ గిరాకీ వుంది.

16వ శతాబ్దములో నేసిన సిల్కు తివాసి, 1857 లో లండన్ ప్రదర్శనంలో పెట్టారు. అది యిప్పటికి లండన్ మ్యూజియంలో వుంది. దానిలో 35 లక్షల కుట్లున్నాయట. ఒక చదరపుఅంగుళంలో 12 వేల కుట్లు పట్టేటంత సన్నంగా కుట్టేవారని ప్రసిద్ధి. వివిధరంగులు వేయటంలో, డిజైనులు గీయుటలో మనకళాకారులు పెట్టినదిపేరు. అట్లే వరంగల్ తివాసీలుకూడ పేరు గాంచాయి. కొంతకాలం బందరులోకూడ ఈపరిశ్రమ వుండేది. ఇక్కడినుండే యివి ఎగుమతి అయేవి.

పారశీక డిజైనులుమాత్రమేగాక, దేశీయ డిజైనులు కూడ మనకళాకారులు ప్రవేశపెట్టారు. నైజాం ప్రభుత్వ కాలంలోకూడ, యీపరిశ్రమకు యితర చేతిపరిశ్రమలకు దోహద మిచ్చి ప్రోత్సహించారు. వరంగల్ కారాగృహములోకూడ మంచితివాసీలు యిప్పటికి తయారవుతున్నాయి.

పక్కా అద్దకమునకు రంగులు, అద్దక సౌకర్యాలు, అందరు కలసి పనిచేయుటకు పెద్దభవన సౌకర్యము, తదితర సౌకర్యాలు ప్రభుత్వమువారు ఏలూరు, వరంగల్‌లో ఇచ్చారు. ప్రయివేటు వర్తకులుకూడ లక్షలాది రూపాయల తివాసీలు విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రభుత్వంవారు సహకార సంఘానికి తగు సహాయము చేసి, వారిఉత్పత్తి నాణ్యమైనది అయేటట్లు చేసి వారి విక్రయశాలలద్వారా, ఢిల్లీ కేంద్రవిక్రయశాలద్వారా విక్రయం చేస్తూన్నారు.

ఎంతసేపు ప్రతివారూ మిర్జాపూరు తివాసీలు అంటారు. మన వరంగల్, ఏలూరు పేర్లు ఎవరు తల పెట్టరు. అఖిలభారత చేతిపరిశ్రమలబోర్డు సమావేశములలో నేను ఈవిషయం వారిదృష్టికి తెచ్చి, ఈపరిశ్రమకు తగు ప్రోత్సాహము వచ్చుటకు చేసిన ప్రయత్నములు కొంత ఫలించినవి కావలసిన ఉన్ని మనరాష్ట్రములోనే లభ్యమవుతుంది. కళాకారులు కూడ వున్నారు. కనుక ఈ పరిశ్రమకుఉజ్వల భవిష్యత్ గలదు. సామాన్యప్రజలు కంబళ్ళు వుపయోగిస్తారు. వీటిని 'గొంగళ్లు' అంటారు. సాలీనా 10 లక్షల రూపాయల విలువగల ఉన్నిబట్ట మన రాష్ట్రంలో తయారవుతూంది. ప్రభుత్వం కూడ ఈపరిశ్రమ అభివృద్ధికై ఎంతో దోహదమిచ్చింది.



బిద్రి కళావస్తువులు

చాపలు :—

సామాన్యవ్యక్తులు రత్నకంబళ్ళు వుపయోగించలేరు. మహబూబునగరందగ్గర ఎనుగొండలో చాపలపరిశ్రమ వన్నె కొంచింది. అతిరమ్యమైన రంగులతో పీటిని నేస్తారు. చాల మృదువుగా, అందంగా వుంటాయి. నెల్లూరు జిల్లాలో కూడ నాణ్యమైన చాపలు తయారుచేస్తారు. దక్షిణాదిని పట్టు మెదైలో అతిసున్నితమైన చాపలు నేస్తారు. "ఆస్థాయికి రాకపోయినా అతిసుందరమైన చాపలు మనరాష్ట్రంలో తయారు చేస్తున్నారు" అని చెప్పాలి. మహబూబునగరంలో ఈవిషయములో రాష్ట్రచేతిపరిశ్రమల సలహాసంఘసభ్యుడు శ్రీముత్యాల చంద్రయ్య యీపరిశ్రమకు ఎంతో దోహద మిచ్చారు.

బిద్రి పరిశ్రమ :—

ఇది నిజంగా చూస్తే పరిష్యాదేశపుకళ అని చెప్పాలి. రాగి, తుత్తునాగం కలిపి ఒకమిశ్రమలోహము చేసి ఎన్నో రకాల వస్తువులు చేస్తారు వెండితో బొమ్మలు, యితర డిజై నులు దించుతారు. నిప్పులో ఒకరకపు మట్టిరాసిన వస్తువు పెట్టినవెంటనే, నల్లగా మారిపోతుంది. వెండిరంగు ఏమీ మారదు. పెట్టెలు, లాంపులు, పూలకూజాలు మొదలగు

వస్తువులు ఎన్నో చేస్తారు. ప్రభుత్వమువారు ఈకళాకారులకు ఒకకేంద్రం కట్టించి యంత్రములు అమర్చి ఇచ్చియున్నారు. తయారయిన సరకులు కొని అమ్ముతున్నారు. హైదరాబాదు సందర్శించుచున్న ప్రతివారు, మూసీనది వద్దునవున్న ఈకేంద్రాన్ని తప్పకుండా సందర్శిస్తారు. విదేశమారకం కూడ యీవస్తువులవలన లభిస్తోంది. కొద్దిసంవత్సరాలక్రితం బ్రిటిషు ప్రదర్శనములో వీటికి అగ్రస్థానం ఇచ్చారు.

ఫి లి గ్రీ :—

వెండినగిషీపనికి కరీంనగరం ప్రసిద్ధి. స్థానిక కంసాలులు ఈవృత్తిలో మంచి నైపుణ్యం సంపాదించారు. తమలపాకు పెట్టెలు, భరిణెలు, సెంటుబుడ్లు, గాజులు మొదలయిన సామానులు ఎన్నో యిచ్చట చేసారు. వెండిని సన్న తీగెగా మార్చి వివిధ డిజైనుల సామానులు తయారుచేస్తారు. ఇచ్చటే కాక, ఒరిస్సాలోకూడ యిట్టివస్తువులు తయారవుతాయి.

దంతం, కొమ్ము సామానులు :—

సికింద్రాబాదులోను, విశాఖపట్టణంలోను ఈపరిశ్రమ అభివృద్ధి కెక్కింది. ఇదికూడ మిగుల ప్రాచీనపరిశ్రమ.

పూ స లు :—

తిరుపతి దగ్గరనున్న పాపనాయుడు పేటలో యంత్ర సహాయం లేకుండా అతి చిన్న గాజుపూసలు తయారు చేస్తారు. ఇంత చిన్న నల్లపూసలు ఎక్కడా తయారవవట. వాటికి వివిధరాష్ట్రములలో గిరాకీవుంది.

హి మ్రూ :—

నూలు, కృత్రిమపట్టు కలిపి శాలువలు, తెరలు, సోఫా కవరులకు పనికివచ్చేగుడ్డ తయారుచేస్తారు. రాష్ట్రపతి భవనంలో ఖాది హిమ్రూ ఉపయోగించడమైనది. మొదట ఈపరిశ్రమ ఔరంగాబాదులో వుండేది. చాలమంది కళాకారులు హైదరాబాదులో నివాసం ఏర్పరచుకోవడంవల్ల ఈపరిశ్రమకుకూడ ప్రభుత్వం దోహదం యిచ్చారు.

చేనేత పరిశ్రమ :—

రాష్ట్రములో ఏమూలకు పోయినా చేనేత కేంద్రాలే. వెంకటగిరి, నారాయణవరం,ఉప్పాడ, పోచంపల్లి, ధర్మవరం, గద్వాల, మోరి, యింకా ఎన్నో వందలాది గ్రామాలలో ఈ పరిశ్రమ వన్నెకొంచింది. 5 లక్షల మగ్గాలు మనరాష్ట్రంలో వున్నాయి. ప్రభుత్వం సహకారక్షేత్రమునకు ఎంతో సహాయం చేస్తూంది. కలంకారి అద్దకానికి బందరు పెట్టినది పేరు. ప్రభుత్వం చేనేతకళాకారుల అభివృద్ధికై ఎంతో

తోడ్పడుతోంది. వారికి కావలసిన నూలు లభ్యమయేటందుకు, సహకార నూలుమిల్లుల స్థాపనకు ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలు కల్పించింది. విక్రయసౌకర్యాలు,విక్రయ కేంద్రాలు ఇచ్చింది. శిల్కుచీరలు ధర్మవరంలో విరివిగా నేయ బడుతున్నాయి. ముడి సిల్కుకూడ, మనరాష్ట్రంలో తయారవుచున్నది.

లే సు :—

లేసుపరిశ్రమకూడ మంచి అభివృద్ధి దశలో వుంది. సాలీనా సుమారు 20 లక్షలరూపాయిల లేసుసామాన్లు తయారవుతాయి. విదేశాలకు ఎగుమతి అవుతోంది. పశ్చిమ గోదావరి జిల్లాలో వేలాది ప్రజలు ఈవృత్తిపై ఆధారపడు తున్నారు.

ప్రభుత్వ సహాయం :—

'సహకారం సగంబలం' అన్నట్లు ప్రభుత్వం ఈ సిద్ధాంతానికి చాల ప్రాధాన్య మిచ్చింది. అంతే కాక తయా రయిన సరుకులు నాణ్యముగా వున్నాయా లేవా? అని చూచే టందుకు 'quality marking schemes' అమలులో పెట్టింది. మేలురకముల పనిముట్లు సరఫరా చేసింది. మార్కెటింగు సౌకర్యాలు విక్రియశాలల ద్వారా కలుగ చేసింది. శిక్షణ సౌకర్యాలుకూడ యిచ్చింది.

అఖిలభారత చేతిపరిశ్రమల బోర్డుకూడ ఈపరిశ్రమలకు మంచి దోహద మిచ్చింది. చాలాకాలం బోర్డుసభ్యులుగా నున్న యీరచయిత, అధ్యక్షురాలు కమలాదేవి రాష్ట్ర మంతటా పర్యటన చేసి, వీటి అభివృద్ధికి తగు దోహద మిచ్చారు.

ఉప సంహారం :—

అభిరుచులు మారినా చేతిపరిశ్రమలకు మన అభివృద్ధి కార్యక్రిమములలో గొప్పస్థానం గలదని, రాజులు లేరుకనుక భూస్వాముల పరిస్థితులు మారాయికనుక ప్రిభుత్వమే వీటిని పోషిస్తోంది. ప్రిభుత్వం ఎంత సహాయం చేసినా ప్రిజలుకూడ చేతిపరిశ్రిమలను ఆదరించాలి. రాజాదరణకు బదులు ప్రిజాదరణ వుండాలి. ప్రిజల ప్రోిపు లేకపోతే చేతిపరిశ్రిమలు అభివృద్ధి పొందలేవు.

వీటిని పోషించాలంటే ముక్కోటి ఆంధ్రిలకు కష్టమా ? పనితనం బాగావుంటే వస్తువులకు ఒకరూపాయి హెచ్చు యివ్వలేమా ? ఎంతసేపూ విదేశాలవారు కొనాలి అని చెప్పకుండా మనమే వాటిని ప్రోత్సహించాలి. విదేశీయులు ఇచ్చటకు వస్తే మనవారు వారి ఆదరణ మీదే మనచేతి పరిశ్రమలు ఆధారపడుతున్నట్లు మాట్లాడతారు.

మనము తప్పకుండా కొన్ని సరకులు విదేశాలకు ఎగుమతి చేయవచ్చును. ఇవి మనవైజ్ఞానిక రాయబారులుగ పనిచేయ గలవు. కాని,మనం తయారు చేసిన అన్నిసామానులు ఇతర దేశాలు కొనాలనుకొనుట చాల తప్పు. తయారయే సరకులు ఉపయోగపడేవిగా,సామాన్యవ్యక్తి కొనుటకు వీలుండేటట్లుగా, నాణ్యమైనవిగా ఉండాలి. ఎక్కువ ఖరీదైనసరకులు ఆర్డర్లు మీద తయారుచేయాలి. ప్రజలకు ఏవి కావాలో అవే చేయాలి. ప్రభుత్వం, చేనేత పారిశ్రామికులు, ప్రజాభిప్రాయం కలసి పనిచేస్తే, ఎంతో బాగుంటుంది. మన రాష్ట్రంలో ఇంకా ఎన్నో చేతిపరిశ్రమలున్నాయి. రాతితో మంచిబొమ్మలు, విగ్రహాలు తిరుపతి, రాజమండ్రి, గుంటూరు ఇతర ప్రాంతాలలో చేస్తారు. లోహముతో బొమ్మలు, తదితర వస్తువులు వివిధ ప్రాంతాలలో చేస్తున్నారు. పూళ్ళలో, తాటికర్రలతో చేతికర్రలు అతి నైపుణ్యంగా చేస్తారు. ఈత ఆకులతో రంగురంగుల బుట్టలు హైదరాబాదు పరిసర ప్రాంతములలో చేస్తారు. వీటికి ఇంగ్లండు, అమెరికాలలో మంచిమార్కెటు గలదు.

చేతిపరిశ్రమలలో ఒక్కఅందమే కాదు. ఉపయోగం కూడ గలదు. సాధ్యమైనంతవరకు మన ప్రజలే వీటిని పోషించాలి. శ్రీ కృష్ణదేవరాయల విగ్రహము తిరుమల

శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయములో గలదు. శ్రీకృష్ణ దేవరాయలే ఆవిగ్రహాన్ని ప్రతిష్ఠించారట. అభిరుచులు, రోజులుమారినా, మనం మనసంస్కృతిని మరువరాదు. చేతి పరిశ్రమలు మనసంస్కృతిని, నాగరికతను వెదజల్లుతాయి. ప్రతిసామాన్యవ్యక్తి చేతిపరిశ్రమలకు చేయూత నివ్వాలి. కొన్ని చేతిపరిశ్రమల సరకులు తనయింట్లో వుంచాలి. బొమ్మల కొలువులలో చేతిపరిశ్రమల సరకులు విరివిగా వుంచాలి. ఆనాడే మనగౌరవము మనజాతిగౌరవము పెరగ గలదు. ఎంతసేపు విదేశముల ఆదరణమీద ఆధారపడుట చాల తప్పు. మనజాతీయగౌరవానికి భంగం. మన దేశంలోని ప్రజలు పేదలు కావచ్చు, కాని, మనకు ఆత్మగౌరవ మున్న దని మనం నిరూపించాలి.

ప్రభుత్వము ఈవిషయంలో ఎంత చేసినా ప్రజలు ఈవిషయములో శ్రద్ధ చూపాలి చేతిపరిశ్రమల అభివృద్ధికి చేయూత నివ్వాలి.

మన ప్రణాళికలో చేతిపరిశ్రమలకు హెచ్చుస్థాయి యివ్వాలి. చాలమంది వీటికి ఆధునిక వ్యవస్థలో స్థానమే లేదని చాల చులకనగా చూస్తారు ధనము కేటాయించే టప్పుడు, యితర పరిశ్రమలకు లక్షలు మంజూరుచేస్తూ,

వీటికి కొన్ని వేలు కేటాయించటానికి వెనుకంజవేస్తారు. చాల మందికి వీటియందు విశ్వాసము లేదు. కాని, ప్రభుత్వం, విదేశప్రభుత్వం ధ్వంసము చేయగా మిగిలిన చేతిపరిశ్రమల నయినా అభివృద్ధిచేసిన మన సంస్కృతి, కళలు మిగులును. Plastic యుగములో వీటికి తావులేదు అని చెప్పుట చాల తప్పు.

ఆంధ్రప్రదేశములో పలురకముల ప్రఖ్యాతివహించి చేతిపనులు నలుదిశల గలవు. భారత చేతిపరిశ్రమల బోర్డుల నివేదికలలోకూడ యీవిషయం పేర్కొనబడింది. మన ప్రజలు, మనప్రభుత్వం వీటికి చేయూత నివ్వాలి, పోషించాలి. యిది కష్టమా ? కాదని ముమ్మాటికి చెప్పాలి.

అనుబంధము 2

## వెండి ఫిలిగ్రీ పరిశ్రమనుగూర్చి సాంఘిక - ఆర్థిక విచారణ.

నాణ్యమైన పనితనానికి, నేర్పుకు యిదొక మచ్చు తునక. ఇది 150 ఏండ్లుగా కరీంనగరంలో సజీవంగా ఉంది. ఈపరిశ్రమ మీద సాంప్రదాయ సిద్ధమైన పద్ధతుల ప్రభావం కనబడుతున్నది. కరీంనగరంలోని స్వర్ణకారులు నాణ్యమైన వెండి ఫిలిగ్రీ వస్తువులు చేస్తారని ఇంపీరియల్ గెజిటేర్‌లో 1909 లోనే వ్రాసారు. ఈపరిశ్రమ యొక్క ప్రారంభం గూర్చి వివరాలు అంతగా తెలియవు. ఈవృత్తిలోనున్న వృద్ధులు తెల్పిన కథనమునుబట్టి కరీంనగరానికి 7 మైళ్ళ దూరంలో ముఖ్యపట్టణంగా ఉన్న ఎలగండల గ్రామానికి చెందిన రామయ్యా అనే వ్యక్తి ఈ ప రి శ్ర మ ను 160 ఏండ్ల క్రితమే ప్రవేశపెట్టినట్లు తెలుస్తున్నది. ఆగ్రామం

1294 వరకు ఆజిల్లాకు ప్రధాన కేంద్రం. తరువాత కరీం నగరానికి మార్చారు. ఈరామయ్య నిపుణుడైన స్వర్ణకారుడు. ఆయన రాష్ట్రంలో అనేకచోట్లకు పర్యాణము చేసేవాడు. ఆయన పర్యటించేటప్పుడు ఈవిద్యను నేర్చుకొని తన గ్రామంలోనే ఆవృత్తినిర్వహిస్తూ, ఆవృత్తి రహస్యాలను బహుగోప్యంగా నుంచేవాడు. దానిని తన యింటనే చేసే వాడు. ఆయన ఆవృత్తిలో తన అల్లునకు శిక్షణ నిచ్చాడు. అతని అల్లుని స్వగ్రామం మానకుండూరు. తొలుత ఈ వృత్తి ఈరెండు గ్రామాలకే పరిమితమై వుండేది. దరిమిలా 75 ఏండ్ల క్రిందట ఈవృత్తిదార్లు కరీంనగరానికి వలస పోయారు. అప్పటి కలక్టరైన బహాఉద్దీన్ యిందుకు కారకుడు. ఆయన ఈవృత్తిలో భీష్మాచార్యుడైన కడార్ల రామయ్యకు ఉచితంగా నివసించేందుకు స్థలం యిచ్చాడు. రామయ్య ద్వారా ఈవృత్తి అతని కుటుం బములోని వారి కందరికి సంక్రమించింది. ఈవృత్తి కేవలం స్వర్ణకారుల కుటుంబాలకే పరిమితమైనది. రెండు వెండి గుండ్రపు దారాలను కలిపి పనిచేస్తారు. ఒరిస్సాలో ఒకేచతురపు దారమును ఉపయోగిస్తారు. అందుచే ఇచ్చట తయారయే ఫిలిగ్రి సామానులు నాణ్యమైనవి, అందమై నవిగా ఉంటాయి.

1948 వ సంవత్సరము వరకు ఈవృత్తి బాగానే సాగింది. రాజులు నవాబులు మొదలగు సంపన్నులు దీనిని ఆదరించారు. దీనిని మహమ్మదీయులు యెక్కువగ ఆదరించిరి. తమయింట వివాహాలలో కట్నపుకానుకలలో భాగంగా ఫిలిగ్రీ వస్తువుల నిచ్చేవారు. ఆనాడు కొనుగోలు దార్లు, ఉత్పత్తిదార్ల ఇంటికి వెళ్ళి తయారైన వస్తువులు కొనడము, కొత్తవాటిని చేయమని ఆదేశించడంకూడజరిగేది. వెండి తులం అర్ధరూపాయి ఉన్నరోజులలో ఈపనివారికి రోజుకు 3 రూపాయలనుండి 5 రూ॥ మధ్య వేతనంగా లభించేది. పనివారికి ఎల్లవేళల, చేతినిండా పని వుండేది. కొన్ని వేళల వారిని చెయ్యమని ఆదేశింపబడిన సరకు అంతా తయారు చేయుటకూడ అసాధ్యమయ్యేది. ఆనాడు వారి ఆర్థిక పరిస్థితి మెరుగుగా వుండేది. లాభసాటిగా ఉండుటవల్ల పెక్కుమంది దీనిని అనుసరించడం, తద్వారా ఈపని వారి సంఖ్య పెరగటం, జరిగింది.

దేశానికి స్వరాజ్యం వచ్చాక రాజకీయ, సాంఘిక, ఆర్థికమైన మార్పులెన్నో వచ్చాయి. వాటి ప్రభావానికి ఈపరిశ్రమ గురియవడం, పూర్వపు సంపన్నులంతర్థానమవడం, 1949 నుండి ఈపరిశ్రమ దెబ్బతినడం జరిగింది. ఈవస్తువులకు గిరాకీ తగ్గడం ఈవృత్తిలోని వారికి

కృష్ణపక్షం రావడం మొదలైంది. పనివారు ఎంత తక్కువ వేతనానికి తృప్తిపడ్డా, ఈవస్తువులు కోరేవారే తక్కువయ్యారు. 1948-56 సం॥ మధ్య ఈవృత్తి పతనావస్థకు వచ్చింది ఆసంవత్సరం సహకార సంఘముల పునరుద్ధరణ జరిగింది. పతనావస్థకు వచ్చిన ఈపరిశ్రమకు ఆసంఘం ఒక ఆశాకిరణమైంది. ఈదుస్థితిలో అధిక వేతనాల నివ్వగల వెండి, బంగారు వస్తువుల తయారీ వంకకు పనివారు తమ దృష్టిని మరిలించారు.

సుమారు 40 ఏండ్ల క్రిందట ప్రభుత్వకృషి మూలకంగా ఈపరిశ్రమాభివృద్ధికి కరీంనగరంలో "తరక్షన్", "జాగారం ఉస్మానియా" అనే రెండు సహకార సంఘాలు నెలకొల్పారు. వీటిలో 14 నుండి 19 మంది వరకు సభ్యులు ఉండేవారు. స్వర్ణకారులు, వెండి పనివారు దాదాపు అందరు కూడ రెంటిలో యేదో ఒక దానిలో సభ్యు లయ్యారు. ఈరెంటి ఆశయం ఒకటే కావడంవల్ల వీటిమధ్య సంఘర్షణ లేకుండా రెంటిని కలిపి ఒకే సంఘంగా రూపొందించాలని ప్రయత్నాలు జరిగాయి. 1953 లో జాగారం సంఘాన్ని తరక్షన్ సహకార సంఘంలో విలీనం చేశారు.

1953 లో సమైక్యతరక్షణా సంఘం ఉద్భవించింది. దీనిలో సభ్యుల సంఖ్య 80. ఇది 1956-57 వరకు పని ప్రారంభించలేదు. పరిశ్రమల శాఖ వీరికి రూ॥ 25000 లు ఋణము, రూ॥ 5000 గ్రాంటు యిచ్చారు. 1957-58 నుంచి నిర్వహణ సహాయ నిమిత్తం ఆసంఘానికి ఏటా రు. 3000 కొన్ని సంవత్సరాలపాటు యివ్వబడినది. ఆసంఘానికి సంబంధించిన ఆనాటి వివరాలు ఈదిగువ పొందుపరుప బడ్డాయి

సభ్యుల సంఖ్య 87

వాటా ధనం=రూ॥ 1225-71

వర్కింగ్ పెట్టుబడి ధనం=రూ॥ 20,000-00

రిజర్వు నిధి=664-00.

తొలిదశలో ఈసంఘం పెక్కు అరిష్టముల నెదుర్కొన వలసి వచ్చింది. స్వయం పోషకం కావడానికి ఉత్పత్తి విక్రయాలను వృద్ధిచేసుకోవలసిన అవసరం కల్గింది. ప్రభుత్వం వారి గ్రాంటు లేకపోతే ఈసంఘపు మనుగడయే అసాధ్యమైపోయేది. సహకార కేంద్ర బ్యాంకులోను పారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్యలోను ఈసంఘానికి సభ్యత్వం గలదు.

కరీం నగరంలోని సహకార సంస్థానంలో సుమారు 87 మంది సభ్యులున్నా వారిలో చాలమందికి ఫిల్గ్రి పని తెలీదు. వారు వెండి పని లేక బంగారు పని లేక రెండు పనులు చేయువారు. వారిలో 54 మందికి మాత్రం ఈఫిల్గ్రి పని తెలియునని వారిలో 14 మంది వివిధప్రాంతాలకు వలస వెళ్ళి యితర పనులు చేపట్టారని తెలియుచున్నది. వీరుగాక కరీంనగరులోని యిద్దరు పనివారు ఈవృత్తిని పూర్తిగా ఎప్పటికీ వదలివేసారు. వలసవెళ్ళిన వారిలో ఒక కుటుంబంలోని ముగ్గురు మాత్రం మధ్యమధ్య ఈపని చేబడుతూంటారు. కొన్ని సమష్టి కుటుంబాలలోని అందరు సభ్యులు సహకారసంఘ సభ్యులుకారు. అందులోని ఒకరో యిద్దరో సభ్యులు కావడంవల్ల ఆకుటుంబంలో తయారైన ఫిలిగ్రి వస్తువు లన్నిటినీ సంఘానికి విక్రయించుట జరుచున్నది. ఈవృత్తి పనివారందరూ పూర్తిగా ఫిల్గ్రి పని మాత్రం చేయటం లేదు. ఈమధ్య మరింత లాభసాటిగా వున్న బంగారుపని వంకకు వారి దృష్టి మళ్ళుతున్నది. పూర్తిగా ఫిలిగ్రి పనిమీదనే ఆధారపడిన పనివారు ఆరుగురున్నారు. మొత్తం ఉత్పత్తిలో సగానికిసగం వారుచేసినదే. అతినాణ్యమైన ఫిలిగ్రి వస్తువులు చేయగల నిపుణులైన పనివారు ఆరుగురు మాత్రమే

ఇది చాలాక్లిష్టమైన శ్రమతో కూడినపని అనేమాట నిర్వివాదాంశం. ఆపనిని ఐదు భాగాలుగా విభజించవచ్చు.

(1) తీగ తీయుట.

(2) నమోనాలు, బాహ్యారూపముల కల్పన.

(3) లోపల "half roll pieces"ను అమర్చుట.

(4) Soldering.

(5) నగిషీ మెరుగుపెట్టుట.

స్వచ్ఛమైన వెండిని నిడివిగల కడ్డీలుగాచేసి దాని నుండి తీగలను ఒక ఉక్కు పళ్ళెరంగుండా తీస్తారు. ఫిలిగ్రి వస్తువులు తయారైన తర్వాత చక్కటి ఆకర్షణ, నాజూకు పనితనంకల్గి వుంటాయి. తరుచుగా 30, 32 గాజ్‌ల తీగను ఫిలిగ్రి పనులకు వాడుతారు. ఒకే వరుసకు. 30 జంటవరుసకు 32 ఉపయోగింపబడుతాయి. డ్రాయింగ్ ప్లేటుతో చతురస్ర రంధ్రాలగుండా 30 గాజ్ ఒకే వరుసన పంపబడుతుంది. ఇది మిశ్రమరూప చతురస్రమయే దాకా ఈప్రక్రియ పునశ్చరణ చేయబడుతుంది. అప్పుడు ప్రతితీగను ఒక చర్ఖకు పంపి, దానికి కొన్ని వంపులు యివ్వబడుతాయి. ఈపని అది పలుచని "వైర్‌స్క్రూ" అయేదాకా చేయబడుతుంది.

పరికర సామగ్రి :—

"భారతీయ స్వర్ణకారులు పరికరాలమీదకంటె తమ స్వంత నైపుణ్యం మీదనే యెక్కువ ఆధారపడతారని వారికి గల పరికరసామగ్రి తక్కువ" అను లోకోక్తి ఫిలిగ్రీ పనివారి విషయంలో యథార్థం. చాల పరికరాలు పాత కాలమునాటివి. చాలా మోటురకపువి. ఒక్కొక్క ఉత్పత్తి శాలలో పరికరాల కొరకు సగటున పెట్టేపెట్టుబడి రూ॥ 74. ఇందు నిమిత్తం రెండు రూపాయలు మాత్రం పెట్టుబడి పెట్టిన వ్యక్తి కూడ మరొక రున్నారు.

ఈపని చక్కగా నెరవేర్చాలన్నా, సౌకర్యంగా నిర్వహించాలన్నా ఒక్కొక్క ఉత్పత్తి శాఖలో రూ॥ 300 విలువగల పరికరాలైనా వుండాలి.

ముడిసరుకు :— ఈపరిశ్రమలో వాడే ప్రధాన మైన ముడిసరుకు స్వచ్ఛమైన వెండి. ఇది స్వేచ్ఛగా లభ్యం కావడానికి యెటువంటి యిబ్బంది వుండదు. అది స్థానిక వర్తకులవద్ద కరీంనగరంలోనే దొరుకుతుంది. గత కొన్ని సంవత్సరాలుగా వెండి ధరలు పెరిగి పోతున్నాయి.

శిక్షణ :— సాంప్రదాయ సిద్ధంగా దీని ననుసరించే స్వర్ణకార కుటుంబాలలోని వారుతప్ప యితరులు ఈచేతిపనిని

సులభంగా అలవర్చుకొనలేరు. దీనికి సహజమైన నేర్పు, ఓర్పు, అభిరుచి కావాలి. అందువల్లనే ఆ వర్ణస్థుడు కాని ఏవ్యక్తి కూడ యిందులో తగినంత పరిజ్ఞానం పొందడానికి కనీసం మూడేండ్ల కాలమన్నా పడుతుంది. ఇది చాలా నైపుణ్యం కావలసిన విద్య. కనీసం 5 ఏండ్లైన ఏకధాటిగా శిక్షణ పొందితే కొంత నేర్పు సంపాదిస్తాడు. పరిపూర్ణమైన నేర్పు, కనీసం పదేండ్లకుగాని సిద్ధించదు.

ఉత్పత్తివ్యయం :—

వెండి ఖరీదు, వేతనపురేట్లనుబట్టి ఉత్పత్తి వ్యయం వుంటుంది. వెండి వాడకంలో 2శాతం తరుగును సహకార సంఘాలు అనుమతిస్తాయి. తయారైన వస్తువుల ఉత్పత్తి వ్యయం తులం వెండికి రు. 3.50 ల చొ॥న అయింది. సహకార సంఘంవారు ఈవ్యయంలో యింటి అద్దె పర్యవేక్షణ వ్యయం మొదలగు అదనపు ఖర్చులను చేర్చలేదు. ఈఖర్చు ఏడాదికి సుమారు రు 2500 వరకు వుంటుంది. దానిని ప్రభుత్వ మిచ్చిన గ్రాంటునుండి భరించెడివారు. సంఘంవారు ఉత్పత్తి వ్యయం మీద 12½ శాతం లాభం వేసుకొని విక్రియ వెల నిర్ణయిస్తున్నారు. ఈవిధంగా ఉత్పత్తి వ్యయాన్ని నిర్ణయించడం ఉత్పత్తి వ్యయాన్ని నిర్ణయించే వ్యాపార సూత్రాల మాదిరిగా లేదు.

పెట్టుబడి [స్థిరమైన పెట్టుబడి] :—

సహకార సంఘంలో యంత్రాలకొరకు పెట్టిన రు 3500, భవనం కొరకు పెట్టిన రు 7114 మించి, వేరే పెట్టుబడి ఏమీ లేదని చెప్పవచ్చు. స్వంత తయారీ శాలల్లోని పాతకాలపు పనిముట్లనుగూడా పరిగణన లోనికి తీసుకొంటే ఒక్కొక్క తయారీ శాలలో పెట్టుబడి రు 74 మాత్రమే.

భవనాల కొరకు పెట్టిన పెట్టుబడి యింత అని నిర్దిష్టంగా చెప్పడం సాధ్యం కాదు. ఏయింటినీ అది స్వంత యిల్లయినా అద్దె యిల్లయినా—పూర్తిగా పరిశ్రమ కొరకే ఉపయోగించుట లేదు. కిరాయి విలువలో సుమారు అయిదవ వంతును భవనము కొరకు పెట్టుబడిగా చెప్పవచ్చు. ఈ మొత్తం అన్ని తయారీ శాలలకు కలిపి సాలీనా రు॥ 940 అనగా ఒక్కొక్క దానికి సగటున సుమారు రు. 33 అగును. పనివారిలో ఒకరు కేవలం ఈపని నిమిత్తం నెలకు రు 10=00 అద్దెకు ఒక గది తీసికొనిన విషయం కూడ ఇక్కడ పేర్కొనవలసి యున్నది.

ఉత్పత్తి :

1951-61 సం॥ మధ్య సహకార సంఘపు సగటు ఉత్పత్తి సాలీనా రు 16,000. కరీంనగరంలోని ఫిలిగ్రి

ఉత్పత్తి అంతా సహకార సంఘం ద్వారానే విక్రయింప బడుతోంది. ఇందులో సభ్యులు కాని వారు ఉత్పత్తి చేసిన వస్తువులు కూడ ఎవరో ఒక సభ్యుని పేరిట సంఘంద్వారానే విక్రయింప బడుతుంది. ఇది మొత్తములో సుమారు 5 వ శాతముండును. హైదరాబాదులోని ఒక కుటుంబము రు 2000/- విలువగల సరకు తయారుచేసి దాని నంతను, ప్రభుత్వవిక్రయశాల వారికి విక్రయిస్తున్నారు. తయారైన మొత్తము సరకు వెల, షోను రు 18,000 వుండును.

ఉద్యోగావకాశాలు :—

కరీంనగరంలో 38 మంది పనివారు ఎప్పటికీ కాని, అప్పుడప్పుడు కాని ఈ పని చేస్తున్నారు. 1960-61 లో ఈ సంఖ్య 21 మాత్రమే. 21 మందిలో కూడ పూర్తి కాలం పనిచేసే వారు 6 మంది మాత్రమే మొత్తం ఉత్పత్తిలో 60 శాతం వీరిదే.

వేతనాలు :

ఫిలిగ్రీ పరిశ్రమలో చాల సులభమైన పద్ధతిని వేతనాలు నిర్ణయిస్తున్నారు. ఒక వస్తువు తయారీకి పెట్టిన వెండి పరిమాణం తీసుకొని, ఆ వెండి పరిమాణానికి వేతనపు రేటును తులం 1 కి యింత అని అనుసంధిస్తున్నారు. ఈ

రేటు తులం 1 కి రు 1.12 లు నుండి 1.25 ల మధ్య వుంటుంది. ఈ మధ్యలో రోజు 1 కి పట్టిన వెండి పరిమాణాన్ని బట్టి వేతనమును నిర్ణయించుట, తులం 1 కి రేటును ఆవస్తువు స్వరూప స్వభావాలు దాని నమోనా నాణ్యం బట్టి నిర్ణయించుట జరుగుతున్నది.

సాంప్రదాయ సిద్ధమైన ఫిలిగ్రి పనులలో పనివారొక్కొక్కరు, రు 1 మొదలు $1^1/2$ తులాలు వెండితో పనిచేయగలరు. బాగా సమర్థులైన వారు రెండు తులాలు కూడవాడవచ్చు. అంటే వేతనము రోజుకు రూపాయిన్నర, రెండున్నర రూపాయల మధ్య వుంటుంది. ఎనమండుగురు మాత్రం రోజుకు రు 2-50 సంపాదిస్తుంటే, తక్కినవారు రోజుకు రు 1-75 మాత్రం సంపాదింప కల్గుతున్నారు.

ఫిలిగ్రి ఆభరణాల విషయంలో రేటు తులం వెండికి రు 4-5 ల మధ్య వుంటుంది అయితే ఒక తులం వెండి పని చేయడానికి పనివానికి రెండు రోజులు పడుతూంది. సాంప్రదాయసిద్ధమైన వస్తువులు చేసేవారి కన్న ఆభరణాలు చేసేవారి ఆదాయం సుమారు 50-60 శాతం యెక్కువ. ఇతర చేతిపనులవారితో పోలిస్తే ఫిలిగ్రీ పనివారి వేతనం తక్కువ. ఉదాహరణకు, ఒక వడ్రంగి ఈనాడు యింత

కన్న ఎక్కువే సంపాదింప కల్గుతున్నాడు దీనివలన ఫిలిగ్రీ పనివారు నిరుత్సాహం నిరాశకు గురియై బంగారు వెండి వస్తువుల తయారీ వంకకు దృష్టి మళ్ళించుట జరుగు తున్నది. కాబట్టి వారికి మరింత సరసమైన వేతనాలు లభిం చకపోతే, ఈ పరిశ్రమ దెబ్బతినడం తథ్యం. సుమారు 20 ఏండ్లక్రిందట వీరి రాబడి రు 3 నుంచి 5 దాకా వుండేది.

విక్రయం :—

ఉత్పత్తి స్థానంలోనే, తయారైన సరుకంతటినీ విక్రయించేపని, సహకార సంఘం ద్వారా జరుగుతున్నది. ప్రస్తుత ఉత్పత్తి విలువ 18-20 వేలు మాత్రమే గనుక దానిని విక్రయించుట కష్ట సాధ్యం కాక పోవచ్చు. ఉత్పత్తి అంతా అమ్ముడగును. ఫిలిగ్రీ అమ్ముడు కావడానికి ముఖ్య కాలం నవంబరు ఫిబ్రవరి నెలల మధ్యకాలం. ఈ కాలంలో సాంప్రదాయ సిద్ధమైన వస్తువులను ముఖ్యంగా కొనేవారు మార్వాడీలు. వారు సాధారణంగా వీటిని వివాహ కాలపు కానుకలుగా యిస్తారు. మొత్తం ఉత్పత్తిలో 50-60 శాతం హైదరాబాదులోని ప్రభుత్వ విక్రయశాల కొని అందులో 25 శాతం జిల్లాలలోని విక్రయ శాలలకు సరఫరాచేసి, మిగి లినదానిని తాను స్వయంగా విక్రయిస్తున్నది. విక్రయ శాలలో అమ్ముడగు మొత్తం సరుకులో ఆభరణాలు 20

శాతం వుంటవి. ఈ విక్రియశాల వెలుపల జరిగే అమ్మకం ప్రస్తుతం 5 శాతంకూడ వుండటంలేదు. ఖాదీ బండార్, మదరాసు, ఢిల్లీ కేంద్ర విక్రయశాలలవారు ఈ బైటికొను గోలుదార్లు, ఫిలిగ్రీ వస్తువులలో నిత్యవినియోగ వస్తువులకు అనగా, పెట్టెలు, అత్తరుదానులు, గరపెలకు యెక్కువ గిరాకీ వుంది ప్రభుత్వ విక్రయశాల తనకొనుగోలు వెల మీద $12\frac{1}{2}$ శాతం కల్పి దానికి విక్రయపన్ను నిమిత్తం $2\frac{1}{2}$ శాతం జేర్చి అమ్మబడు తున్నది. యితర ప్రభుత్వ విక్రియ శాలలకు సరఫరా చేసిన సరుకుకు $6\frac{1}{4}$ శాతం డిస్కవుంటు యిస్తున్నారు. విక్రయశాల కొనగా మిగిలిన దానిని కరీంనగరంలోని సహకార సంఘం చిల్లరగా విక్రి యిస్తున్నది. ఈ సంఘం యితర రాష్ట్రాలకు సరకు సరఫరా చేసిన సందర్భాలు బహు అరుదు. చిల్లర అమ్మకాల మీద సంఘం $2\frac{1}{2}$ శాతం అమ్మకాల పన్ను వేస్తున్నది.

హైదరాబాదులోని ప్రభుత్వం విక్రియశాల కొనుగోలు, అమ్మకాలనుబట్టి చూస్తే పరిస్థితి అభివృద్ధి కరంగానే వుందని చెప్పవచ్చు. ఫిలిగ్రీ ఆభరణాలకు గిరాకీ పెరుగు తున్నది. ఈ అభివృద్ధి అనతి కాలంలో రు 30,000 లకు పెరుగగ వచ్చని ఆశింపబడుతోంది.

సమస్యలు సిఫార్సులు :—

తయారీ శాలలో పరికరాలు, పనిముట్ల పరిస్థితి బాగాలేదు. పని చక్కగా జరగాలంటే కనీసం ఒక్కొక్క దానికి రు 300 ల విలువగల పనిముట్లన్నా వుండాలి. ప్రస్తుతము సగటున రు 74 లు విలువగలవి మాత్రం వుంటున్నాయి. అవికూడ పాతకాలపు పనిముట్లు. కాబట్టి పని వారికి సరిపడినన్ని క్రొత్తరకపు పనిముట్లు సమకూర్చుట ముఖ్యం. ఇందునిమిత్తం ప్రభుత్వం సబ్సిడీ (Subsidy) రేట్లకు పనివారికి కొన్న పరకరాలను సరఫరాచేయ వలసి యున్నది.

వారి నివాస పరిస్థితికూడ అసంతృప్తి కరంగానే వుంది. చాల యిండ్లకు మరమ్మతులు లేవు. వాటి పరిసరాలు ఆరోగ్యప్రదంగా లేవు. ఆరోగ్యకరమైన చోట వారికి కూడ, చేనేత పరిశ్రమకువలె గృహసౌకర్యాలు ఏర్పాటు చేసి విద్యుచ్ఛక్తి, నీటిసరఫరా కల్గించుట అవసరం.

చాలమంది పనివారికి వారి కుటీరాలలో పనిచేసు కొనడానికి తగిన జాగాలేదు. వారిలో కొందరు యిండ్లలో స్థలం లేక సహకార సంఘంలోనే పని చేసుకుంటున్నారు. కాబట్టి యావత్తు పరిశ్రమ వినియోగార్థం ఒక సమష్టి

సదుపాయ కేంద్రం (Common facility Centre) నెలకొల్పుట అవసరం.

కరీంనగరంలోని సహకార సంఘంలో ప్రస్తుతం చేతితో నడుపబడు యంత్రములు కొన్ని గలవు. కాని దీని వలన గల ప్రయోజనం బహు పరిమితం. తీగతీసేయంత్ర మొకటి వుంది. కాని దానివలన మందమైన తీగను మాత్రం తీయవచ్చు. 32 గాజ్ సన్నటి తీగను తీయటానికి మరి యొక యంత్రం సమకూర్చుట అవసరం.

అనేక సార్లు ఈ సంఘమునకు ప్రభుత్వ విక్రయ శాలనుండి సొమ్ము రావలసి వుండుట వల్ల డబ్బు యిబ్బంది కల్గుతున్నది. సొమ్ములేక నిర్విరామంగా పూర్తి కాలం ఈ పనివారికి సంఘం పని చూపించలేక పోతున్నది ఈ సంఘానికి మరి కొంత వర్కింగ్ కాపిటల్ యిచ్చుట అవసరం.

కుటుంబ సభ్యులసంఖ్య:—

కుంటుంబ సభ్యుల సంఖ్య సగటున 5 29 కుటుంబాల పరిస్థితి పరిశీలింపగా వాటిలో ఆర్థికంగా స్వయం పోషకులుగా వున్నవారు 8 మాత్రమే. మరి ఎనిమిదిలో అయిదింట ఒక్కొక్క సభ్యుడు, మిగిలిన మూడింటిలో

ఒక్కొక్క దాని యందు యిద్దరు సభ్యులు స్వయం పోషకంగా వున్నారు. ఆవిధంగా ఉన్నవారిలో ఒకరు వడ్రంగి మరొకరు ప్రభుత్వోద్యోగి. మిగిలిన 9 యొక్క ప్రధాన వృత్తి వెండి పిలిగ్రి వృత్తి. ఈ 29 కుటుంబాలలో ఫిలిగ్రిపని చేయువారి సంఖ్య 38. వారిలో చాల మందికి కొంతకాలము పాటే పనిదొరుకుతున్నది. 5,6 కన్న ఎక్కువమంది, యితరులకు తగు శిక్షణయివ్వలేరు. తగుచర్యలు తీసికొన్న గాని, పిన్నవయస్కులు, యితర వృత్తులలో బ్రతుకుతెరవు చూచుకోవచ్చును.

విద్య :—

వీరికి సాంకేతిక విద్యా యోగ్యతలులేవు. చాలమందికి ప్రాథమిక విద్యా యోగ్యతగలదు. యిద్దరుమాత్రమే నిరక్షరాశ్యులు తల్లితండ్రులు తమ అనువంశిక విద్యను పిల్లలకు గరపుటకు ఉత్సాహ పడుటలేదు. తగు చర్యలు తీసికొనక పోయినచో, యీపరిశ్రమ కొనసాగక పోయే ప్రమాదము గలదు

రాబడి :—

ఇది రు 30-150 మధ్య వుంటుంది. 9 కుటుంబాలకు వ్యవసాయ రాబడి వున్నది. సగటున ఋణభారము

270 రూపాయలు గలదు. దానికి ప్రతినెలా వడ్డీ కట్టవలసి యున్నది.

ఋణ అవసరాలు, గృహ నిర్మాణం, గృహ విస్తరణ, పాత బాకీల చెల్లింపు, వృత్తిలో పెట్టుబడి మొదలగు అవసరాల నిమిత్తం ఋణము కావలసిన వారు, సుమారు 25 మంది ఉన్నారు. ప్రభుత్వము దీర్ఘకాలపు చర్యలు తీసికొని, దీనికి జీవము పోయవలసి యున్నది. వెండి ఫిలిగ్రీని భారత దేశములోను, విదేశములలోను, అనేక మంది కొనియాడుతారు. నగిషీ వస్తువులు, ఆభరణాలకు, వెండి, యీ పరిశ్రమలో మూలముగా యుండుటచే, పరిశ్రమ చాలమంది దృష్టిని ఆకర్షించుటయేగాక, వివాహసమయములయందు, మహమ్మదీయులలోకూడ, పిల్లలు అత్తవారి యింటికి పోయేటపుడు, వీటిని కానుకలుగా యిచ్చుపద్ధతి యిప్పటికి గలదు. సికిందాబాదు రాష్ట్రపతి నిలయములోను, ఢిల్లీ రాష్ట్రపతి భవనములో, వెండి ఫిలిగ్రి నగిషీ సామానులు, యితర హైదరాబాదు చేతి పరిశ్రమ వస్తులలో ఉపయోగింపబడిన ప్రత్యేకగది ఏర్పాటు చేయబడినది.

21899

ప్రకాశకులు :

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్, హైద్రాబాదు.